RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 108 బుధవారం 14 మే 2025 పేజీలు : 4

## పది ఉపగ్రహాలతో నిత్యం పహారా: ఇస్రో

ఇంఫాల్ : ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో దేశ ప్రజల భద్రత, రక్షణ నిమిత్తం కనీసం పది ఉపగ్రహాలు ఆ కాశంలో నిరంతరం పహారా కాస్తున్నాయని ఇస్రో చైర్మన్ వి నా రాయణన్ అన్నారు. మణిపూర్‌లోని ఇంఫాల్‌లో జరిగిన సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ (సీఏయూ) స్నాతకోత్సవ కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల మధ్య దేశ భద్రత కోసం ఇస్రో చేస్తున్న కృషిని వివరించారు. 'మన ఇరుగు పొరుగు దేశాల గురించి అందరికీ తెలుసు. మన దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం ఉపగ్రహాలతో నిత్యం నిఘా పెట్టాలి. 7 వేల కిలోమీటర్ల మేర ఉన్న సముద్ర తీర ప్రాంతాలను పర్యవేక్షించాలి. మన ఉత్తర భాగాన్నం తా నిరంతరం పరిశీలించాలి. ఉపగ్రహాలు, డ్రోన్ల సాయం లేకుండా దాన్ని సాధించలేం' అని నారాయణన్ అన్నారు.

# దేశమంతా మీవెంటే..!

## ఘర్ మే ఘుస్ కే మారేంగే

### పాక్..ప్రశాంతంగా జీవించదు.. మహా వినాశనం తప్పదు






**అదంపూర్ ఎయిర్ బేస్‌లో మోదీ**
**ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న వైమానికి సిబ్బందితో మాటామంతి**
**పాకిస్తాన్‌కు ఇండియా ఎయిర్‌పోర్స్ సత్తా చాటారు**
**సైన్యం ధైర్య సహసాలకు ప్రశంసలు**

భారత్- పాకిస్తాన్ మధ్య కొనసాగిన యుద్ధం, శతృదేశ సైనికుల నుంచి ఎదుర్కొన్న ప్రతిదాడులు, మోర్టార్ షెల్స్ కాల్పుల మధ్య ఆందోళనకర వాతావరణం నెలకొన్న జమ్మూ కాశ్మీర్‌లో ఇప్పుడిప్పుడే పరిస్థితులు సర్దుకుంటోన్నాయి. సాధారణ జనజీవనం ఏర్పడుతోంది. ప్రజలు తమ రోజువారీ పనుల్లో నిమగ్నమౌతోన్నారు. ఈ పరిస్థితుల మధ్య ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హఠాత్తుగా పంజాబ్‌లో పర్యటిస్తోన్నారు. అక్కడి ఆదమ్‌పూర్ ఎయిర్ బేస్‌ను సందర్శించారు. ఎయిర్ వారియర్‌లతో భేటీ అయ్యారు.

పాకిస్తాన్‌తో యుద్ధ వాతావరణం, సీజ్ ఫైర్ తరువాత నెలకొన్న పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. వారి ధైర్య సాహసాలను మెచ్చుకున్నారు. వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. నిజానికి ఇది అన్ ప్లాన్డ్ ప్రోగ్రామ్. నేటి ప్రధాని షెడ్యూల్‌లో ఆదమ్‌పూర్ ఎయిర్ బేస్ స్టేషన్ సందర్శన లేదు. పైగా రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు కూడా దీనిపై ముందస్తు సమాచారం లేదని తెలుస్తోంది. అప్పటికప్పుడు ఆదమ్‌పూర్ ఎయిర్ బేస్ స్టేషన్‌ను సందర్శించాలని భావించారని, దీనితో రోజువారీ షెడ్యూల్‌లో మార్పులు చేర్పులు చేయాల్సి వచ్చిందని సమాచారం. భారత్- పాకిస్తాన్ మధ్య సీజ్ ఫైర్ ఒప్పందం కుదిరిన రెండో రోజే ప్రధాని మోదీ ఆదమ్‌పూర్ ఎయిర్ బేస్ స్టేషన్‌ను సందర్శించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

వైమానిక దళంతో మాట్లాడారు. వారితో ముచ్చట్లు పెట్టారు. సెల్ఫీ దిగారు. వారి భుజాలపై చేతులు వేసి, ఆప్యాయంగా పలకరించారు. వారు ఎదుర్కొన్న అనుభవాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడారు. పాకిస్తాన్ డ్రోన్లు, అన్ మ్యాన్డ్ ఏరియల్ వెహికల్స్, వార్ ఎయిర్ క్రాఫ్ట్, క్షిపణులు.. ఇవన్నీ కూడా భారత వైమానిక బలం ముందు విఫలం అయ్యాయని అన్నారు. ఈ ఘనత- దేశంలోని అన్ని వైమానిక బేస్ స్టేషన్లకు దక్కుతుందని చెప్పారు. ప్రతి వాయుసేన యోధుడికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఉగ్రవాదులు పాకిస్తాన్‌లో ప్రశాంతంగా జీవించడానికి చోటు లేదనే హెచ్చరికను పంపించామని ప్రధాని మోదీ అన్నారు. హమ్ ఘర్ మే ఘుస్ కే మారేంగే.. అని నినదించారు. ఆపరేషన్ సింధూర్ భారత సాయుధ దళాల సామర్థ్యానికి అద్దం పట్టిందని మోదీ పేర్కొన్నారు. పాక్‌పై దాడులు సమయంలో దేశ సాయుధ దళాల సమన్వయం అద్భుతమని కీర్తించారు. ఆర్మీ, నేవీ, వైమానిక బలగాలు అత్యంత సమన్వయంతో ఈ దాడులు సాగించాయని మోదీ ప్రశంసించారు. నౌకాదళం సముద్ర జలాలపై తన ఆధిపత్యాన్ని ప్రదర్శించిందని, సైన్యం సరిహద్దును బలోపేతం చేసిందని, వాయుసేన దేశానికి రక్షణ కవచంలా నిలవడమే కాకుండా ఎదురుదాడులు సాగించిందని గుర్తు చేశారు. బీఎస్ఎఫ్, ఇతర దళాలు అద్భుతమైన శక్తి సామర్థ్యాలు, పోరాట పటిమను ప్రదర్శించాయని పేర్కొన్నారు. భారత్‌పై కన్నెత్తి చూస్తే మహా వినాశనం తప్పదనే విషయాన్ని ఉగ్రవాదులు, ఉగ్రవాద సంస్థలు, వాటిని ప్రోత్సహిస్తోన్న పాకిస్తాన్ గుర్తించిందని ప్రధాని మోదీ అన్నారు. జీవించడానికి ఏ ఒక్క అవకాశం కూడా వారికి లభించదని తేల్చి చెప్పారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత లక్ష్మణ రేఖ ఇప్పుడు అత్యంత స్పష్టంగా ఉందని, ఇప్పుడు మరొక ఉగ్రవాద దాడి జరిగితే, ముఖం పగిలేలా సమాధానం ఇస్తామని పునరుద్ఘాటించారు. సర్జికల్ స్ట్రైక్, మొన్నటి వైమానిక దాడుల సమయంలో ఈ విషయాన్ని రుజువు చేశామని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ఈ సందర్భంగా మహారాణా ప్రతాప్ వినియోగించిన గుర్రం చేతక్ కోసం రాసిన కొన్ని పంక్తులను ప్రధాని మోదీ ఉటంకించారు. ఆ పంక్తులు ఆధునిక భారతీయ ఆయుధాలకు కూడా సరిపోతాయని వ్యాఖ్యానించారు. వైమానిక దళం పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను 100 శాతం ఖచ్చితత్వంతో, 20-25 నిమిషాల్లోనే నేలమట్టం చేసిందని, ఇది- దేశ రక్షణ సామర్థ్యాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని చాటి చెప్పిందని అన్నారు. పాకిస్తాన్‌లో ఉన్న ఉగ్రవాద సంస్థలు, ఉగ్రవాదులపై దాడి చేయడమే తమ ఉద్దేశమని, ఆ దేశం మాత్రం సరిహద్దుల్లో ఉన్న పౌరులు, జనావాసాలు, పౌర విమానాలపై కాల్పులు జరిపిందని మోదీ ఆరోపించారు. ఇది పాకిస్తాన్ పన్నిన కుట్ర అని విమర్శించారు. పౌర విమానాలకు వాయుసేన ఎటువంటి హాని కలిగకుండా రక్షణగా నిలువగలిగారని చెప్పారు. పాకిస్తాన్ ఎదుర్కోలేని సరికొత్త, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తమ వద్ద ఉందని మోదీ పేర్కొన్నారు. పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా సవాళ్లు సైతం అదే స్థాయిలో ఎదురవుతున్నాయని చెప్పారు. సంక్లిష్ట, అధునాతన వ్యవస్థలను నిర్వహించడం, దాన్ని శతృతవులపై ఉపయోగించే సామర్థ్యం తమకు ఉందనే విషయాన్ని నిరూపించుకున్నారని అన్నారు.



## చల్లని కబురు..

### అండమాన్‌ను తాకిన నైరుతి రుతుపవనాలు

దిల్లీ: గ్రీష్మంతో మాడుతున్న దేశానికి చల్లని కబరు వచ్చేసింది. దేశానికి అత్యధికంగా వర్షపాతానిచ్చే నైరుతి రుతుపవనాలు మరింత చురుగ్గా కదులుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం నాటికి అవి దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవులు, దక్షిణ బంగాళాఖాతానికి చేరినట్లు భారత వాతావరణ విభాగం వెల్లడించింది. రుతుపవనాల ఆగమనం దృష్ట్యా గత రెండు రోజులుగా నికోబార్ దీవుల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని పేర్కొంది. రానున్న మూడు, నాలుగు రోజుల్లో అండమాన్ నికోబార్ దీవులంతటితో పాటు దక్షిణ అరేబియా సముద్రం, బంగాళాఖాతం మధ్య వరకు విస్తరించేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ఐఎండీ వెల్లడించింది. మే 27 నాటికి ఈ రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉన్నట్లు ఇప్పటికే వాతావరణ శాఖ అంచనా వేసిన సంగతి తెలిసిందే. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు పలకరిస్తుంటాయి. ఈ సారి మాత్రం అంతకంటే ముందుగానే వచ్చేందుకు అవకాశాలు కన్పిస్తున్నాయి.

## పాకిస్థాన్ కాళ్లబేరానికి రావడానికి 10 ప్రధాన కారణాలు

భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధం ఆగిపోయిన సంగతి తెలిసిందే. ఇరుదేశాలు కూడా కాల్పుల విరమణకు అంగీకరించాయి. కాల్పుల విరమణకు అంగీక రిస్తున్నామని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. మరోవైపు పాకిస్తాన్ విదేశాంగ శాఖ మంత్రి ఇషాక్ దార్ కూడా ఈ విషయాన్ని ధృవీకరించారు. మొత్తానికి యుద్ధం ఆగడానికి పాకిస్థాన్ కాళ్లబేరానికి వచ్చింది. దీనికి గల 10 ప్రధాన కారణాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

**1.పాక్ను తిప్పికొట్టిన భారత్...** పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్, POKలోని 9 ఉగ్రస్థావరాలపై దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత పాకిస్థాన్.. డ్రోన్లు, మిస్సైళ్లతో భారత్పై దాడులకు దిగింది. కానీ వాటిని భారత్ తిప్పికొట్టింది. అలాగే పాకిస్థాన్లోని లాహోర్తో పాటు పలు ప్రాంతాల్లో ఎయిర్బేస్లను ధ్వంసం చేసింది. కానీ పాకిస్థాన్ భారత్లో డ్రోన్లు, మిస్సైళ్లతో ఎలాంటి నష్టం చేయలేకపోయింది.

**2.పాకిస్థాన్కు సరిపడా ఆయుధాలు లేకపోవడం...** పాకిస్థాన్ ప్రతిరోజూ కాల్పులకు దిగితే వాటి వద్ద ఉన్న ఆయుధాలు కొన్ని రోజుల్లోనే ఖాళీ అయిపోతాయి. గతంలో పాకిస్థాన్ ఉక్రెయిన్కు కూడా ఆయుధాలు అమ్ముకుంది. కానీ భారత్కు మాత్రం పాకిస్థాన్కు కన్నా ఎక్కువగా ఆయుధాలు, ఆధునిక టెక్నాలజీ ఉంది.

**3.పాక్కు ప్రపంచ దేశాల సాయం నిరాకరణ...** భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో పాకిస్థాన్కు టర్కీ తప్ప మిగతా ఏ దేశాలు కూడా మద్దతు తెలిపేందుకు ముందుకు రాలేదు. ఆఖరికి చైనా కూడా పాక్కు మద్దతిచ్చేందుకు వెనుకాడింది. ఉగ్రవాదానికి తాము వ్యతిరేకమని స్పష్టం చేసింది. చివరికి గల్ఫ్ కంట్రీస్ కూడా పాక్కు సపోర్ట్ ఇచ్చేందుకు ముందుకు రాలేదు. మొత్తానికి ఇక్కడ పాకిస్థాన్ ఏకాకి అయిపోయింది.

**4.అమెరికా వార్నింగ్...** పాకిస్థాన్ భారత్పై F16 ఫైటర్ జెట్ను




ప్రయోగించిన సంగతి తెలిసిందే. దాన్ని పాక్ అమెరికా నుంచి కొనుగోలు చేసింది. దాన్ని కేవలం ఉగ్రవాదులపై మాత్రమే వినియోగిస్తామని అమెరికాతో ఒప్పందం చేసుకుంది. కానీ దాన్ని భారత్పై ప్రయోగించింది. ఈ విషయంలో అమెరికా కూడా పాక్పై అసహనం వ్యక్తం చేసింది. పాకిస్థాన్కు కూడా భారత్ ఎదురుదాడుల వల్ల గట్టి షాక్ తగిలింది. దీంతో కాల్పుల విరమణ ఒప్పందం జరిగేలా మధ్యవర్తిత్వం వహించాలని అమెరికాతో కాళ్లబేరానికి వచ్చినట్లు తెలుస్తోంది. పాక్ విదేశాంగ మంత్రి కూడా భారత్ కాల్పులు ఆపితే తాము కూడా ఆపుతామంటూ ప్రకటన చేశారు.

**5. పాకిస్థాన్లోనే వ్యతిరేకత...** భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధం వల్ల పాకిస్థాన్లోని ప్రజలు కూడా అక్కడి షెహబాద్ షరీఫ్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ముందుగా తమ రాజకీయ నేతల ఇళ్లపై దాడులు చేయాలంటూ కూడా పలువురు సోషల్ మీడియాలో పోస్టులు చేశారు.

**6. పక్కలో బల్లెంలా మారిన బలూచిస్థాన్...** ప్రస్తుతం పాకిస్థాన్లో బలూచిస్థాన్ వివాదం కూడా నడుస్తోంది. అక్కడి వాళ్లు బలూచిస్థాన్ను స్వయంప్రతిపత్తి గల రాష్ట్రం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో పాక్ రైలును కూడా హైజాక్ చేశారు. తాజాగా భారత్తో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కూడా పాక్ సైనికులపై దాడులకు దిగారు. ఓ కాన్వాయ్ను కూడా పేల్చేశారు. అందులో దాదాపు 12 మంది పాక్ సైనికులు మృతి చెందారు. పాకిస్థాన్కు భారత్తోనే కాకుండా బలూచిస్థాన్తో కూడా వైరుధ్యం ఉండటంతో ఆ దేశానికి పెద్ద ఎదురుదెబ్బ తగులుతోంది.

**7. ఆర్థిక సంక్షోభంలో పాకిస్థాన్...** పాకిస్థాన్లో ప్రస్తుతం ఆర్థిక పరిస్థితి దారుణంగా దిగజారిపోయాయి. అక్కడి ద్రవ్యోల్బణం తారాస్థాయికి చేరింది. ప్రజలు కనీసం నిత్యావసర వస్తువులు కొనుక్కోలేని పరిస్థితులు నెలకొన్నాయి. భారత్తో యుద్ధం చేస్తే ఇంకా తమ పరిస్థితి మరింత క్షీణిస్తుందనే భావన పాకిస్తాన్కు వచ్చేసింది.

**8. పాక్ ఉగ్రవాద బండారాన్ని ప్రపంచానికి చూపిన భారత్...** భారత్.. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్, POKలోని ఉగ్రస్థావరాలపై దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో దాదాపు 100 మంది ఉగ్రవాదులు హతమైనట్లు భారత్ తెలిపింది. అయితే పాకిస్థాన్ సైనికులు ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాల్గొన్న వీడియోలు బయటకి వచ్చాయి. ఈ విషయంలో ప్రపంచ దేశాల నుంచి కూడా పాకిస్థాన్పై తీవ్ర విమర్శలు వచ్చాయి.

**9. రాజకీయ సంక్షోభం...** పాకిస్థాన్లో ప్రస్తుతం రాజకీయ సంక్షోభం కూడా ఉంది. భారత్తో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పాక్ పార్లమెంటులో అక్కడి ఎంపీ షెహబాజ్ షరీఫ్పై తీవ్ర విమర్శలు చేశారు. తమ ప్రధాని పిరికివాడంటూ వ్యాఖ్యానించారు. అక్కడి ప్రజలు కూడా షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. చివరికి షెహబాద్ సోదరుడు నవాజ్ షరీఫ్ కూడా యుద్ధం విషయంలో రాజీపడేందుకు ముందుకొచ్చారు.

**10 ఇమ్రాన్ ఖాన్ ఎఫెక్ట్...** పాకిస్థాన్ మాజీ అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్ ప్రసుతం జైల్లో ఉన్న సంగతి తెలిసిందే. దీంతో ఆయన మద్దతుదారులు ఇమ్రాన్ ఖాన్ను జైలు నుంచి విడుదల చేయాలంటూ డిమాండ్ చేశారు. కొందరు ఇమ్రాన్ ఖాన్ ఉంటున్న జైలుకు వెళ్లి కూడా నిరసనలు చేశారు. యుద్ధ పరిస్థితులు తీవ్రతరమైతే ఇమ్రాన్ ఖాన్కు ఇది అనుకూలంగా మారే అవకాశం ఉంటుంది. మరోవైపు సైనికుల చేతిల్లోకి పాలన వెళ్లిపోయే పరిస్థితులు కూడా రావొచ్చు. అందుకే పాకిస్థాన్ యుద్ధం విషయంలో మొత్తానికి కాళ్లబేరానికి వచ్చింది.



## కీలక నిర్ణయం దిశగా రేవంత్ సర్కార్..

### ఇకపై నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లోకే డబ్బులు

హైదరాబాద్ : రాష్ట్రంలోని వివిధ సోషల్ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, రెసిడెన్షియల్ వసతి గృహాల్లో మెరుగైన సేవలు అందించడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను సీఎస్ కె.రామకృష్ణరావు ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలలో నాణ్యమైన భోజనం, చక్కటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆ మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం సచివాలయంలో రాష్ట్రంలోని ప్రభుత్వ సాంఘిక, గిరిజన, మైనారిటీ వసతి గృహాల నిర్వహణపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాబోయే విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ వసతి గృహాలకు సరిపడా నాణ్యమైన సరుకులు, విద్యార్థుల టెక్స్ బుక్స్, నోట్ బుక్స్ యూనిఫామ్స్, బెడ్ షీట్లు కార్పెట్స్, స్కూల్ బ్యాగ్స్ తదితర సామగ్రి సమకూర్చుకునేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సరుకుల క్వాలిటీ విషయంలో రాజీపడొద్దని సీఎం ఆదేశించాలని తదనుగుణంగా అధికారులు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

**నేరుగా విద్యార్థుల ఖాతాల్లోకే:** విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీల చెల్లింపులను నేరుగా విద్యార్థుల బ్యాంక్ అకౌంట్లో జమ చేసేందుకు తగు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. డెబిట్ కార్డు తరహాలో ఒక స్మార్ట్ కార్డును అందించడం వల్ల విద్యార్థులకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన ఏర్పడుతుందని చెప్పారు. విద్యార్థులు తమకు కావాల్సిన కాస్మెటిక్ వస్తువులు కొనుగోలు చేసుకోవడానికి మహిళా సంఘాలు నిర్వహిస్తున్న మొబైల్ విక్రయకేంద్రాలతో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమీక్షలో ఎస్ సి డెవలప్ మెంట్ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యా సంస్థల కార్యదర్శి డా.ఎ వర్షిణి, సెర్ప్ సీఈవో దివ్య, బీసీ వెల్ఫేర్ సెక్రటరీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## పీఓకే మాటతో పాక్ కి మోడీ చెక్

పాక్ తో మాటలు ఉండాలన్నా మాట్లాడుకోవడాలు ఉండాలన్నా పీఓకేతోనే అని మోడీ స్పష్టం చేశారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ మీదనే చర్చలు అని ఆయన తేల్చేశారు. మొత్తానికి చూస్తే భారత్ పాక్ ఆయువు పట్టు మీద గురి చూసి కొట్టింది అని అంటున్నారు. గత పాతిక రోజులుగా దేశంలో చోటు చేసుకున్న అనేక పరిణామాల మీద తొలిసారి తన మనసులో భావాలను జాతిని ఉద్దేశించి నరేంద్ర మోడీ జాతి జనులతో పంచుకున్నారు. దూరదర్శన్ ద్వారా ఆయన అరగంట పాటు ప్రసంగించిన తీరు చూస్తే పాక్ తో దేనికైనా సిద్ధమే అన్నట్లుగానే చెప్పారని అనిపిస్తోంది. ఉగ్రవాదాన్ని ఆపకపోతే పాక్ కి బుద్ధి చెబుతామని వార్నింగ్ కూడా ఇచ్చారు. అంతే కాదు ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా తుదముట్టిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. ఉగ్రవాదం సింధు నదీ జలాల నీటి పంపిణీ ఏక కాలంలో ఉండవని పేర్కొన్నారు. ఉగ్రవాదం వాణిజ్యం కలసి ప్రయాణించలేవని అన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషించడం పాకిస్థాన్ మానుకోవాలని ఆయన సూచించారు. ఉగ్రవాదం చర్చలు ఒకేసారి జరగవని స్పష్టం చేశారు. రక్తం నీరు కలసి ప్రవహించలేవని అన్నారు. అణుబాంబులతో భారత్ ఎవరూ కూడా బెదిరించలేరని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి పాకిస్థాన్ పుట్టిల్లు అని గురి చూసి మరీ అంతర్జాతీయ సమాజం ముందు పాక్ ని నిలబెట్టారు. ఉగ్రవాదులు మతం పేరిట విధ్వంసం సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత దేశం అంతా కూడా ఒక్కతాటిపై నిలిచిందని గుర్తు చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారతదేశం తన సత్తాను ప్రపంచానికి చాటిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉద్ఘాటించారు. ఉగ్రవాదుల శిబిరాల మీద బలమైన దాడులు నిర్వహించిందని అన్నారు. భారత రక్షణ దళాలు ప్రతిభా పాటవాలను పూర్తి స్థాయిలో ప్రదర్శించాయని గుర్తు చేశారు. భారత జవాన్ల సామర్థ్యం దేశానికి గర్వకారణమని అన్నారు. భారత నిఘా వర్గాల సమర్ధత రక్షణ శాఖ శాస్త్ర సాంకేతిక సంపత్తిని కూడా దేశమంతా చూసిందని చెప్పారు. భారత తోబుట్టువుల నుదుటి సింధూరం తుడిచిన ఉగ్రవాదులని కూకటి వేళ్ళతో పెకిలించడం జరిగిందని ప్రధానమంత్రి అన్నారు. పాకిస్థాన్ తనకు తానుగా ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేయాలని చెప్పారు. అణుబాంబులతో మనల్ని ఎవరూ కూడా బెదిరించలేరని స్పష్టం చేశారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ ని వదలడం తప్ప పొరుగుదేశానికి మరో గత్యంతరం లేదని ప్రధానమంత్రి అన్నారు. ఇక మీదట పాకిస్థాన్ తో చర్చలు భారత్ పెట్టిన షరతుల మేరకే సాగుతాయని ఆయన చెప్పారు. మొత్తానికి చూస్తే మోడీ స్పీచ్ పవర్ ఫుల్ గా సాగింది. భారతీయుల చాలా సందేహాలను అది తీర్చింది. అంతే కాదు పాక్ భారత్ మీద మరోసారి ఉగ్ర నీడ ఉంచినా ఏ విధంగా కెలికినా దబిడి దిబిడి అయిపోతుందని కూడా మోడీ పక్కా మాస్ వార్నింగ్ ఇచ్చేశారు. ఇక తేల్చుకోవాల్సింది పాక్ మాత్రమే అని అంటున్నారు.

## రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే అధికారుల సూచనలు పాటించాలి

శామీర్ పేట, (గరుడ వార్త) : రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే అధికారుల సూచనలు పాటిస్తూ సాగు చేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు అని శాస్త్రవేత్తలు తెలిపారు. మంగళవారం మండల కేంద్రం శామీర్ పేట, మురహరి పల్లి గ్రామాలలో రైతు ముంగిటల్లో శాస్త్ర వేత్తల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలను విత్తుకోవాలని, మోతాదుకు మించి యూరియాను వాడాలని సూచించారు. పచ్చి రొట్టె విత్తనాలు వేసి నేలను సారవంతం చేసుకోవాలని తెలిపారు. పంట మార్పిడి విధానాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. వరి పంటలకు బదులు కూరగాయల పంటలు సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని చెప్పారు. రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ బేబీ అకుల, డాక్టర్ లావణ్య, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ శ్రీరంజిత, శామీర్ పేట సహకార సంఘం చైర్మన్ మధుకర్ రెడ్డి, వైస్ చైర్మన్ ఐలయ్య యాదవ్, వ్యవసాయాధికారి రమేష్, విస్తరణాధికారులు రవి, సుధీర్, సహకార సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.




## విక్రయం.. ఇంకెంత విరామం!.. హెచ్ఎండీఏ లేఅవుట్ల ప్రకటన ఎప్పుడో?

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలోని లేఅవుట్ల అభివృద్ధి, విక్రయాలకు సంబంధించి ఏడాదిన్నరగా ఎలాంటి ప్రకటనా వెలువడం లేదు. ఈ విషయంలో అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఏడాదిన్నర క్రితం వరకు హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో చేపట్టిన ప్లాట్ల విక్రయాలకు భారీ డిమాండ్ వచ్చింది. రూ.వేల కోట్లు ప్రభుత్వ ఖజానాకు చేరాయి. కోకాపేటలో ఏకంగా ఎకరా రూ.100 కోట్లు పలికింది. తర్వాత బుద్వేల్, మోకిలా లాంటి డిమాండ్ ఉన్న ప్రాంతాల్లోని లేఅవుట్లల్లో ప్లాట్లను విక్రయించారు. తర్వాత కాలంలో స్థిరాస్తి మార్కెట్‌లో వచ్చిన స్తబ్ధతతో ప్రస్తుతం వేలం జోలికిపోవడం లేదు. ఇటీవల హెచ్ఎండీఏ కొంత కసరత్తు చేసినా తర్వాత వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.

**ఆ నాలుగు ప్రాంతాల్లో డిమాండ్...**

హెచ్ఎండీఏ ఏడు జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. అయితే రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి పరిధిలో లేఅవుట్లలోని స్థలాలకు డిమాండ్ ఉంటోంది. ఇక్కడ గతంలో మిగిలిపోయిన లేఅవుట్లలోని 39 బిట్లకు ఈ-వేలం వేశారు. రంగారెడ్డి పరిధిలో 10, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఆరు, సంగారెడ్డిలో 23 ప్రాంతాల్లో స్థలాలకు ఈ-వేలం వేయగా.. ఎక్కువకే అమ్ముడయ్యాయి. ఈ ఊపుతోనే కోకాపేటలోని మిగిలిన భూమితో పాటు బుద్వేల్, మోకిలా, మేడిపల్లి, బహదూర్‌పల్లి.. ఇలా కొన్ని ప్రాంతాల్లో లేఅవుట్లు వేసి విక్రయించారు. ప్రభుత్వ ఖజానాకు రూ.2-3 వేల కోట్ల ఆదాయం వచ్చింది. న్యాయపరమైన చిక్కులు లేకపోవడం, పూర్తిస్థాయిలో భూ యజమాన్య హక్కులతోపాటు భూ వినియోగానికి సంబంధించి మార్పులు చేసే అవకాశం లేకపోవడం.. అన్ని స్థలాలకు రోడ్ల అనుసంధానమే కాకుండా నివాస గృహాలు, బహుళ ప్రయోజన జోన్లు, కార్యాలయాలు, వాణిజ్య సంస్థలు, ఇతర మిశ్రమ వినియోగానికి ఈ స్థలాలను వాడుకునే వీలుండటం వల్ల డిమాండ్ ఉంటోంది.

**ఆచితూచి ముందుకు..**గతంలో విక్రయించిన లేఅవుట్లలో మిగిలిన స్థలాలను విక్రయించాలని నిర్ణయించారు. తుర్కయాంజల్, మేడిపల్లి, మోకిలా తదితర కొన్ని ప్రాంతాల్లోని లేఅవుట్లను ఎంపిక చేశారు. అంతేకాక బంజారాహిల్స్‌లోని అత్యంత విలువైన 16 ఎకరాలను వేలం ద్వారా విక్రయించాలని యోచించారు. ఉగాది తర్వాత ఈ ప్రక్రియ ఉంటుందని భావించినా అధికారులు ఆచితూచి ముందుకెళ్లాలని భావిస్తున్నారు.

## పూడికతీతకు ఇదే అదను



పరిగి : అన్నదాతల ఆర్థికాభివృద్ధికి ఆయువు పట్టుగా ఉన్న లఖ్నాపూర్ జలాశయాన్ని అభివృద్ధి చేయాల్సిన సమయం ఆసన్నమైంది. దశాబ్దాలుగా పూడికతీత పనులు చేపట్టకపోవడంతో అది రానురాను మైదానాన్ని తలపిస్తోంది. వర్షాభావ పరిస్థితులు తలెత్తడం, ఉన్న వనరుల్లో జలకళ లేకపోవడంతో సాగు సమస్యగా మారింది. చిన్నపాటి వర్షాలకు నిండటం, తరవాత వట్టిపోవడం ఏటా పరిపాటిగా మారింది. దాదాపు అయిదున్నర దశాబ్దాలు కావొస్తున్నా మరమ్మతులకు సంబంధించి ఏనాడూ పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాలేదు. చేస్తున్న అరకొర పనులు అక్కరకు రాకుండా పోతున్నాయి. నిర్వహణ లోపంతో ఆయకట్టుదారులు నానా కష్టాలు పడుతున్నారు. ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని ప్రాంతాల్లోనూ వందలాది బోర్ల ద్వారా సేద్యం చేస్తుండటమే ఇందుకు నిదర్శనం.

**తగ్గుతున్న తైబందీ..**

రెండు ప్రధాన కాల్వల పరిధిలో లఖ్నాపూర్, మిట్టకోడూరు, రాజాపూర్, మోమిన్‌కలాన్, అంతారం, ఐనాపూర్, నాగారం, మోమిన్‌కుర్దులో ఆయకట్టు పొలాలున్నాయి. వరి, మొక్కజొన్న, పత్తి ప్రధానంగా సాగు చేస్తుంటారు. ప్రాజెక్టులో సుమారు నాలుగు అడుగులకుపైగా పూడిక చేరింది. వానాకాలం సీజన్ కావడం.. వర్షాలు పడే అవకాశం ఉన్నందున అవసరమైన మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రాజెక్టు కింద మొత్తం ఆయకట్టు 2,600 ఎకరాలు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో కేవలం 800 ఎకరాలకు మాత్రమే నీరు విడుదల చేస్తున్నారు. చివరి భూములకు ఎప్పుడూ నీరందడం లేదు. ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా భూములు పోగొట్టుకున్న రైతులు సైతం నీరందక నష్టపోతున్నారు. పూడికతీత పనులకు వేసవి సరైన అదను అని, పనులు ప్రారంభించేందుకు అధికారులు కార్యాచరణ ప్రారంభించాలని కోరుతున్నారు. **రైతులు ముందుకు రావాలి..**

ప్రాజెక్టులో పూడికతీత పనులకు సంబంధించి రైతులు ముందుకు రావాలి. దరఖాస్తులు ఇస్తే ఉన్నతాధికారులకు ప్రతిపాదిస్తాం. కట్టపై పెరిగిన పొదలను ఉపాధిహామీ పథకం కింద తొలగింపు పనులు చేపట్టాం. రూ.15 లక్షల వ్యయంతో ఆర్నెల్ల కిందట కుడి, ఎడమ కాల్వల్లో పెరిగిన పూడికమట్టి, పిచ్చి మొక్కలను తొలగించడంతో నీరు సాఫీగా సరఫరా అవుతోంది. నిధులు మంజూరైన వెంటనే అవసరమైన పనులు చేపడతాం.

కృష్ణారెడ్డి, డీఈఈ, నీటిపారుదల శాఖ

## సాంకేతిక సమస్యలు.. అర్జీదారుల అవస్థలు

కరీంనగర్ : లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల పరిష్కారానికి సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) కింద స్థలాలు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి 25 శాతం రాయితీ అవకాశాన్ని ఇచ్చింది. గత నెల 31 వరకే గడువు ముగియగా, పలు కారణాలతో గడువు పెంచారు. ఈనెల 30 వరకు ఫీజు చెల్లించడానికి, అర్జీలను పరిష్కరించుకునేందుకు వెసులుబాటు ఇవ్వడంతో ఆలోగా దరఖాస్తులు పరిష్కరించుకోవడానికి ఎక్కువ సంఖ్యలో అర్జీదారులు వస్తున్నారు.

**కొందరికే మార్పులు, చేర్పులు**

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో ఉన్న పొరపాట్లను సవరించుకోవడానికి పురపాలక శాఖ అవకాశం ఇచ్చింది. అయితే కొందరికే సవరణలు, మార్పులు చేసుకోవడానికి ఆన్‌లైన్‌లో చూపిస్తుండగా మిగతా వారు ఫీజు కట్టేందుకు సిద్ధంగా ఉండి అభ్యంతరాలను పరిష్కరించుకోలేకపోతున్నారు. పేర్లు, విస్తీర్ణం, సర్వే నంబర్లు, ఫోన్ నంబర్లు, కాలనీల పేర్లు మార్చుకోవడానికి ప్రయత్నించే వారికి సాధ్యం కావడం లేదు.


**స్పందించని ఎల్-1 అధికారులు**

ఎల్-1 అధికారులు స్థలం, ప్లాట్ దగ్గరికి వెళ్లి యాప్‌లో ఆ వివరాలను నమోదు చేయాల్సి ఉండగా జాప్యం చేస్తున్నారు. ఫీజు చెల్లించుకోవడానికి సవరణలు చేసుకుంటే తప్పుగా నమోదవుతున్నాయి. వీటిని అధికారులు పరిష్కరించాల్సి ఉండగా కనీసం ఫోన్ ద్వారా కూడా స్పందించడం లేదు. కొందరి ఫోన్లు పని చేయడంలేదు.

**ఇలా చేయాలి**

నగరపాలికతోపాటు మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్కుల దగ్గర రద్దీ తగ్గాలంటే మరిన్ని కేంద్రాలు పెంచాలి.

దరఖాస్తుదారులు పలుమార్లు తిరగకుండా అధికారుల కోసం టోకెన్ విధానం అమలు చేసి ఏ రోజుకు ఆ రోజు పరిష్కారం చూపాలి.



ఎక్కువగా ఎఫ్‌టీఎల్, నిషేధిత జాబితాలో ఉన్న వారే ఫీజు కట్టేందుకు ఆసక్తి చూపుతుండగా ఏయే పత్రాలు అవసరమనేదీ స్పష్టంగా తెలపాలి.

అన్ని సవ్యంగా ఉన్నట్లైతే వెంటనే అనుమతి వచ్చేలా చూడాలి.

సాంకేతిక సమస్యలన్నీ త్వరలో పరిష్కారమవుతాయని, ఉన్నతస్థాయిలో సమీక్ష జరిగిందని, క్షేత్ర స్థాయిలో వస్తున్న ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లామని కరీంనగర్ నగర పాలిక పట్టణ ప్రణాళిక అధికారి పేర్కొన్నారు.

**ఇవీ ఇబ్బందులు**


ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో ఐజీఆర్ఎస్ దస్త్రాలు అప్‌డేట్ కావడం లేదు.

ఎల్-1 అధికారి పరిశీలించిన తర్వాత దరఖాస్తుదారు ఫీజు కడితే మళ్లీ ఆయన వద్దకే వెళ్తుంది.

ఎల్-2లో ఆమోదించిన తర్వాత ఎల్-3 లాగిన్లకు వెళ్లకుండా ఎల్-1కు వెళ్తుండటంతో దరఖాస్తుదారులు గందరగోళానికి గురవుతున్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ

శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం తరుపున గౌడ సంఘం ఆధ్వర్యంలో అలాగే అల్వాల్ కు చెందిన





మంచాల రవీందర్-రమాదేవి దంపతులు వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. శామీర్ పేట కు చెందిన మేడి సరిత అన్నదానానికి సహకారం అందివ్వగా వంటిమామిడికి చెందిన కరుణాకర్, బొల్లారం బజార్ కు చెందిన గీత లు కూరగాయలు అందజేశారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

## యాసంగి ధాన్యం.. సేకరణకు సిద్ధం

వికారాబాద్ : యాసంగిలో పండించిన ధాన్యాన్ని కొనేందుకు అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఈనెల 10న నిర్వహించిన సమన్వయ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ దిశానిర్దేశం చేసి దానికనుగుణంగా అధికారులను కార్యోన్ముఖులను చేశారు. ఈనెల 25 వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు.

**జిల్లాలో సాగు ఇలా..**



జిల్లాలో 95 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అందులో 35 వేల మి.ట. మిల్లర్లకు కేటాయించాలని, 5వేల మె.ట. విత్తనాల ఉత్పత్తికి వినియోగించాలని, 30 వేల మె.ట. ఆహార ధాన్యాల కోసం అవసరమని అధికారులు గుర్తించారు. మిగతా 130 వేల మె.ట. ధాన్యాన్ని కొనాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన ప్రతిపాదనలను కలెక్టర్ నేతృత్వంలో ఇదివరకే పౌర సరఫరాల కమిషనర్‌కు పంపారు. ఆ శాఖ ఆమోదం మేరకు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

**పక్కా ప్రణాళిక..**కలెక్టర్ నేతృత్వంలో అధికారులతోపాటు మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి యాసంగి ధాన్యాన్ని కొనేందుకు పక్కా ప్రణాళిక రూపొందించాం. ఇందులో భాగంగానే ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు కేంద్రాల ద్వారా కొంటాం. కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తాం. - మోహన్‌బాబు, జిల్లా పౌరసరఫరాల అధికారి.

**ఐకేపీ, సింగిల్ విండో, మెప్మా ఆధ్వర్యంలో..**

జిల్లావ్యాప్తంగా ఐకేపీ, సింగిల్ విండో, మెప్మా ఆధ్వర్యంలో 128 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో 11 కేంద్రాలు సన్నాలు, 117 దొడ్డు రకాలు కొనుగోలు కేంద్రాలున్నాయి. జిల్లాలో 56 రైసు మిల్లులు, 3 బాయిల్డ్ రైసు మిల్లులున్నాయి. సాధారణ గ్రేడ్ ధాన్యం క్వింటా ధర రూ.2,300, గ్రేడ్-1కు రూ.2,320 ఉంది. సన్న వరికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తోంది. జిల్లాకు 40 లక్షల గన్నీ సంచులు అవసరం కాగా.. ఇప్పటికే 20 లక్షలు అందుబాటులో ఉన్నాయి. దశలవారీగా మరో 20 లక్షల సంచులు జిల్లాకు రప్పించేందుకు దృష్టి సారించారు.

# సరిచేసే సమయమిదే..!

భానుపురి : జిల్లాలో వంగిన స్తంభాలు, వేలాడిన తీగల మరమ్మతుకు వేసవి కాలమే మంచి తరుణం. వర్షాలు కురిసిన వెంటనే వ్యవసాయ పనులు ప్రారంభమవుతాయి. అప్పుడు మరమ్మతుకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. వీటితో పశువులు, మనుషులు మృత్యువాత పడే ప్రమాదం ఉంటుంది. ముందే మేల్కొంటే అలాంటి ఘటనలు జరగకుండా ఉంటాయి. విద్యుత్తు అధికారులు వేసవిలోనే పనులు ప్రారంభిస్తే మంచిది.

**సరఫరాలో అంతరాయాలకు అడ్డుకట్ట..**

వేసవిలో ముందుగానే పొలాలు, రోడ్ల వెంట తెగిన పడిన తీగలు, వంగిన స్తంభాలను సరిచేస్తే వర్షాకాలంలో గృహాలకు విద్యుత్తు సరఫరాలో ఎటువంటి ఆటంకం ఉండదు. గాలిదుమారానికి స్తంభాలు కూలిపోవడం, తీగలు తెగడంతో గంటకొద్దీ ఇళ్లకు సరఫరా నిలిచిపోతుంది. రాత్రి పూట మరీ ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉ




ంటుంది. ఇప్పటికైనా జిల్లాలో స్తంభాలు, తీగలను వెంటనే మార్చాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్తు అధికారులను వివరణ కోరగా ఇప్పటికే పలుచోట్ల స్తంభాలు, తీగలను సరిచేయించాం. మిగతా చోట్ల కూడా చేయించి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు.

**స్తంభాలు, తీగలు మరమ్మతులు..** ఏళ్ల నుంచి పాత స్తంభాలు, తీగలు ఉన్నాయి. ఈదురుగాలులు, వర్షాలతో పొలాల్లో తీగలు తెగిపడి ఉంటాయి. వాటిని నెలల తరబడి అలాగే ఉండటంతో వ్యవసాయ పనులు ప్రారంభ సమయంలో రైతులు వాటిని గమనించకుండా పనులు చేస్తుంటారు. పశువులు కూడా అక్కడ తీగలు తెగి ఉన్నాయనే విషయం వాటికి తెలియదు. ఈ కారణంగా విద్యుదాఘాతం జరిగి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఏటా పశువులు, మనుషులు మేతకు వెళ్లినప్పుడు, నాట్లు వేస్తున్న కూలీలకు తాకి మృతిచెందిన ఘటనలున్నాయి. ఇప్పుడే స్పందించి సరిచేస్తే వర్షాకాలంలో ఎటువంటి ఆపద తలెత్తదు.

# లక్ష్యం.. నిర్దేశం

నిర్మల్ : మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు ఆర్థిక చేయూత కోసం అందించే రుణాల్లో బ్యాంకు లింకేజీ ఒకటి. చిన్న వాటితోపాటు భారీ పరిశ్రమలను ఏర్పాటు చేయిస్తూ వ్యాపార పరంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుంది. ఏటా లక్ష్యాలను నిర్ణయిస్తుంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సర్కారు తాజాగా లక్ష్యం కేటాయించింది. గత ఏడాది ఇచ్చిన వాటి కంటే అధికంగా రుణాలు ఇప్పించడంతోపాటు వసూళ్లలోనూ ప్రత్యేకత కనబర్చాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 33,023 ఎస్‌హెచ్‌జీలకు రూ.1425.87 కోట్ల రుణాలను ఇప్పించేలా ప్రణాళికలు సిద్ధం చేసి జిల్లాలకు పంపించారు.

**వ్యాపారపరంగా..**ఒక్కో సంఘానికి రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు ఇవ్వనున్నారు. ఇందుకోసం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సంబంధిత బ్యాంకులను సంప్రదించి ఇప్పించనున్నారు. పొందిన రుణాలతో సభ్యులు భారీ, చిన్న కుటీర పరిశ్రమలు, కిరాణా, వస్త్ర దుకాణాలు, టైలరింగ్, వ్యవసాయ రంగానికి సంబంధించి నాటు



కోళ్లు, చేపల పెంపకం, కూరగాయలు పండించడం తదితర వాటితో ఉపాధి పొందనున్నారు. ఇచ్చిన రుణాలను నెలవారీగా చెల్లిస్తూనే పొదుపు పాటించేలా అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు వారికి సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. ముఖ్యంగా మహిళలు వ్యాపారంలో రాణించేలా ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. కుటుంబానికి ఆర్థిక వెన్నుదన్నుగా వారు నిలుస్తున్నారు.

**మహిళలకు మేలు: విజయలక్ష్మి, డీఆర్డీవో, నిర్మల్**

ఎస్‌హెచ్‌జీల్లోని మహిళల ఆర్థిక తోడ్పాటుకు బ్యాంకు లింకేజీ రుణాలు ఎంతో మేలు చేయనున్నాయి. లక్ష్యం పూర్తి చేసేలా ఇప్పటి నుంచి కార్యాచరణ రూపొందించాం. ఇప్పటికే మూడు పర్యాయాలు వరుసగా రాష్ట్ర స్థాయిలో జిల్లాను ఉన్నత స్థానంలో నిలపడం ఆనందంగా ఉంది. ఇదే స్ఫూర్తితో ఈ ఆర్థిక సంవత్సరంలోనూ ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేశాం. తీసుకున్న రుణాలతోపాటు పొదుపు నెలవారీగా చెల్లింపులు చేపట్టేలా అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి వారిలో చైతన్యం తీసుకొచ్చేలా సూచనలు, సలహాలు ఇచ్చాం.

## స్టేడియం పనులు.. పూర్తికాక పదకొండేళ్లు

వేములవాడ: వేములవాడ పట్టణంలో క్రీడా మైదానాలు లేవు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని మైదానం అంతంత మాత్రంగానే ఉంది. మినీ స్టేడియం పూర్తయితే ఎంతో ఉపయోగంగా ఉంటుందని భావించినప్పటికీ ఏళ్లుగా నిర్మాణంలోనే మూలుగుతోంది. తిప్పాపూర్ శివారులో అయిదెకరాల విస్తీర్ణంలో స్టేడియం నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.2.10 కోట్లు మంజూరు చేసింది. 2014లో అప్పటి స్పీకర్ మధుసూదనాచారి శంకుస్థాపన చేశారు. మొదట పనులు చేపట్టిన గుత్తేదారు మధ్యలోనే చేతులెత్తేశారు. ఆ తరువాత మరో గుత్తేదారు అసంపూర్తిగా వదిలేశారు. అప్పటి నుంచి పనులు తిరిగి మొదలు కావడం లేదు. మొదట విడుదలైన నిధులు సరిపోకపోవడంతో ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసింది. దీంతో తిరిగి పనులు చేపట్టిన గుత్తేదారు క్రీడాకారులకు అవసరమైన విశ్రాంతి భవనం, డ్రెస్సింగ్ గదులు, క్రీడా పరికరాలు భద్రపరిచే గది, కార్యాలయ భవనం, తదితర గదుల నిర్మాణాలు, ప్రహరీ నిర్మాణాలు చేపట్టి మధ్యలోనే వదిలేశారు. ఇండోర్ స్టేడియం పైకప్పు వరకు గోడలు నిర్మించారు. మైదానంలో మొరం పోసి చదును చేశారు. ఆర్చీగేటు నిర్మాణం, మైదానంలో ట్రాక్ పనులన్నీ అసంపూర్తిగానే నిలిచి ఏడాది కావొస్తుండటంతో తుమ్మచెట్లు పెరిగాయి.

వేములవాడ పట్టణంలో క్రీడా మైదానాలు లేవు. కేవలం కళాశాల మైదానమే అన్నింటికి పెద్ద దిక్కుగా మారింది. కళాశాల తరగతులు నడుస్తున్న సందర్భాల్లో అక్కడ ఎలాంటి క్రీడల నిర్వహణకు అవకాశం ఉండదు. ఈ ప్రాంతంలో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, ఖోఖో, షటిల్ వంటి క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆడిన క్రీడాకారులున్నారు. సరైన క్రీడా మైదానాలు లేక క్రీడాకారులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోలేక పోతున్నారు. స్టేడియం పనులు తిరిగి వారం రోజుల్లో మొదలవుతాయని టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ ఏఈ శ్రీకాంత్ పేర్కొన్నారు.

# లేనిది ఉన్నట్లు.. అంతా కనికట్టు



ఆదిలాబాద్ :బట్టిసావర్గాం శివారులో 6 ఎకరాల్లో దాదాపు 90 ప్లాట్లతో తయారైన లేఅవుట్ ఇది. ఇందులో పార్కుల్లో పచ్చదనం, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటకున్నా, మంచినీటి ట్యాంకు, సెప్టిక్/ఎస్టీపీ ట్యాంకు నిర్మించకున్నా ఉన్నట్లు తప్పుడు నివేదికలు సమర్పించి తుది ఆమోదం జారీ చేశారు.ఇది మావల పరిధిలో 15 ఎకరాల్లో 200 ప్లాట్లతో వెలిసిన వెంచర్. ఇక్కడ పార్కులో, బహిరంగ స్థలాల్లో పచ్చదనం లేదు. మంచినీటి ట్యాంకు నిర్మించలేదు. భూగర్భ మురుగు కాలువలు లేకున్నా ఉన్నట్లుగా తనిఖీ నివేదిక సమర్పించి లేఅవుట్‌కు తుది ఆమోదం పొందారు. బల్దియాలో కొందరు స్తిరాస్థి వ్యాపారులు చేస్తున్న మాయాజాలానికి అధికారులు వత్తాసు పలుకుతున్నారు. లేనిది ఉన్నట్లుగా తప్పుడు నివేదికలతో కనికట్టును ప్రదర్శిస్తున్నారు. పట్టణంలోని పలు లేఅవుట్లలో పూర్తిస్థాయిలో వసతులు కల్పించకున్నా అన్నీ సవ్యంగా ఉన్నాయంటూ తనిఖీ నివేదికలు సమర్పించి తుది ఆమోదం జారీ చేస్తున్నారు. వెంచర్లలో కొన్ని అభివృద్ధి పనులే చేసినా అన్నీ చేసినట్లు సృష్టించిన తప్పుడు తనిఖీ నివేదికలు వెలుగుచూశాయి. రూ.లక్షలు వెచ్చించి ప్లాట్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు మోసపోతున్నారు. వ్యాపారులు లాభపడుతున్నారు.

**18 రకాల సదుపాయాలు ఎక్కడ**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం లేఅవుట్ చేయాలనుకున్న స్థిరాస్తి వ్యాపారి డీటీసీపీ ఆమోదం కోసం టీజీ–బీపాస్‌కు దరఖాస్తు చేసుకుంటారు. జిల్లాస్థాయి లేఅవుట్ కమిటీ స్థలాన్ని పరిశీలించి సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించి అన్నీ సవ్యంగా ఉంటే తాత్కాలిక ఆమోదం(టెంటేటివ్ అప్రూవల్) జారీ చేస్తారు. రెండేళ్లలో లేఅవుట్ యజమాని నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలి. విద్యుత్తు సదుపాయం, తాగునీటి వసతి కల్పించాలి. పార్కులను అభివృద్ధి చేయాలి, పచ్చదనం పెంపొందించాలి. ఇలా 18 రకాల అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాతే అధికారులు మళ్లీ లేఅవుట్‌ను పరిశీలించి పూర్తిస్థాయిలో లేఅవుట్‌ను అభివృద్ధి చేస్తే తుది ఆమోదానికి సంబంధించిన ప్రొసీడింగ్స్ జారీ చేస్తారు. లేకపోతే రిమార్కులు రాసి మళ్లీ ఆయా పనులను పూర్తి చేయాలని స్థిరాస్తి వ్యాపారికి సూచించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయితేనే అధికారులు ఆ వెంచర్లలో భవన నిర్మాణ అనుమతులు జారీ చేయాలి.

**తప్పుడు నివేదికలు సమర్పించి**

బల్దియాలో విలీనమైన మావల, బట్టిసావర్గాం పరిధిలోకి వచ్చే పలు లేఅవుట్లలో ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు జరగలేదు. గతంలో తాత్కాలిక అనుమతి పొందిన లేఅవుట్ల యజమానులు పూర్తిస్థాయి ఆమోదం కోసం దరఖాస్తు చేసుకోగా అధికారులు లేఅవుట్లను పరిశీలించి సౌకర్యాలు లేకున్నా తుది ఆమోదం ఇచ్చేశారు. వాస్తవానికి అక్కడ రహదారులు, మురుగు కాలువలు, విద్యుత్తు సదుపాయం మాత్రమే కల్పించారు.

మంచినీటి ట్యాంకులు నిర్మించలేదు.

సెప్టిక్, మురుగు శుద్ధి కేంద్రాలు లేవు.

సామాజిక ఇంకుడు గుంతలు నిర్మించలేదు.

బోరుబావులు తవ్వించలేదు.

మ్యాన్‌హోల్స్‌తో కూడిన భూగర్భ మురుగు కాలువలు లేవు.

పార్కులు, బహిరంగ స్థలాల్లో పచ్చదనం లేదు.

రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటలేదు.

# వెక్కిరిస్తున్న ఖాళీలు.. అటవీ రక్షణపై నీలినీడలు




జన్నారం : కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం పరిధిలోని జన్నారం అటవీ డివిజన్‌లో పలువురు బీట్ అధికారులు ఆరు నెలల క్రితం ఇతర ప్రభుత్వ కొలువులు సాధించి వెళ్లిపోయారు. దీంతో ఇక్కడ ఏర్పడిన ఖాళీలు ఇంత వరకు భర్తీ కాలేదు. ఏడాదిన్నర క్రితం అటవీ డివిజనల్ అధికారి హైదరాబాద్‌లోని అటవీశాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీ కావడంతో అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగానే ఉంటుంది. జన్నారం రేంజీ అధికారిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకే దీర్ఘకాలిక సెలవు మీద వెళ్లడంతో ఏడాది నుంచి రేంజి అధికారి పోస్టు ఇన్‌ఛార్జితోనే నడుస్తోంది. అడవిని రక్షించాల్సిన బీట్ అధికారులు, డివిజన్ మొత్తాన్ని నడిపించే డివిజన్ అధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కలప స్మగ్లర్లను అరికట్టడానికి ఇద్దరే రేంజి అధికారులు ఉన్నారు.

**బీట్ అధికారులిలా..**జన్నారం అటవీ డివిజన్‌లోని ఇంధన్‌పల్లి బీట్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న వేముల హరీశ్, బంగారుతండా బీట్ అధికారి బానోత్ సంతోష్, మల్యాల్ బీట్ అధికారి శ్రావణ్‌కుమార్, తాళ్లపేట రేంజి పరిధి తపాల్‌పూర్ బీట్ అధికారిగా విధులు నిర్వర్తించే దండేపల్లి మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన సందుపట్ల లక్ష్మీపతిలకు గ్రూపు–4లో కొలువులు రావడంతో వెళ్లిపోయారు. దొంగపల్లి బీట్ అధికారి ప్రణీత్‌కుమార్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్‌లో వార్డు అధికారిగా కొలువు సాధించారు. ఇలా అయిదుగురు బీట్ అధికారులు ఒకేసారి తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి వెళ్లడంతో జన్నారం అటవీ డివిజన్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

జన్నారం రేంజి అధికారిగా ఏడాది నుంచి తాళ్లపేట రేంజి అధికారి సుష్మారావుకు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి ఆమె రెండు రేంజీల బాధ్యతలు సమర్థంగానే నిర్వర్తిస్తున్నారు. జన్నారం రేంజి అధికారి పోస్టును భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

**ఎఫ్‌డీఓ పోస్టు మరిచిపోయారా?**

అటవీ డివిజన్‌కు ఎఫ్‌డీఓ పోస్టు ఎంతో కీలకం. జన్నారం అటవీ డివిజన్ అధికారిగా నాలుగున్నర సంవత్సరాలు పని చేసిన సిరిపురపు మాధవరావు 2023 నవంబరులో బదిలీపై హైదరాబాద్ వెళ్లారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగానే ఉంది. దీంతో కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రానికి జీవనాడిగా నిలుస్తున్న జన్నారం డివిజన్ పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా మారింది. కిందిస్థాయి సిబ్బంది, అధికారుల పోస్టులు ఖాళీగా ఉండటం కలప స్మగ్లర్లకు వరంగా మారింది. ఇప్పటికైనా అటవీశాఖ ఉన్నతాధికారులు జన్నారం డివిజన్ మీద దృష్టిసారించి ఖాళీలను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.


# తాళం.. వారికి ఆహ్వానం

నిర్మల్ : జిల్లా పరిధిలో ఇటీవల దొంగతనాలు ఎక్కువవుతున్నాయి. పల్లె, పట్నం తేడాలేకుండా చోరీలు పెరగడంతో జనం భయాందోళనకు గురవుతున్నారు. తాళం వేసి ఉంటే చాలు దొంగలకు వరమవుతోంది. నిరంతర నిఘా, విస్తృత గస్తీ చేపడుతున్నామని పోలీసులు ప్రకటిస్తున్నా దొంగతనాలు ఆగకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. చేసేదేం లేక కొన్నిచోట్ల స్థానికులే చొరవ తీసుకొని ప్రత్యేకంగా గస్తీ చేపడుతున్నారు.

**ఇటీవలి ఘటనలు**సోన్ మండలం మాదాపూర్‌లోని రెండిళ్లలో ఇటీవల దొంగతనం జరిగింది. ఇళ్లకు తాళం వేసి ఉండటం, కుటుంబసభ్యులు ఇంటి డాబాపై నిద్రిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఒకరింట్లో రూ.15 వేలు నగదు, తులంన్నర బంగారం అపహరణకు గురవగా, మరో ఇంట్లో ఏం పోయాయో తేలలేదు.భైంసా మండలం వాలేగాం వాసి మాధవరావు ఉపాధినిమిత్తం మహారాష్ట్రలో ఉంటారు. అతడి భార్య, కుమారుడు బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. తాళం వేసి ఉండటం గమనించిన దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. రూ. 1.80 లక్షల నగదు, ఐదు తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి.బాసర మండలం టాక్లీ గ్రామంలో ఓ కుటుంబం ఇంటికి తాళం వేసి, డాబాపై నిద్రిస్తున్న సమయంలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. తులం బంగారం, వెండి ఆభరణాలతో పాటు రూ. 30 వేలు నగదు ఎత్తుకెళ్లారు.

జిల్లా కేంద్రంలోని గాజులపేట్‌లో నివాసముంటున్న సాబీర్ ఇంట్లో సుమారు 20 రోజుల క్రితం దొంగలు చొరబడ్డారు. ఇంట్లోని బీరువా తెరిచి మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదు అపహరించారు. ఆ ఇంటి పక్కనే నివాసముండే అన్వర్ ఇంట్లోనూ చోరీకి పాల్పడ్డారు. బీరువా తెరిచి రూ.6 వేలు నగదు, రెండు బంగారు ఉంగరాలు ఎత్తుకెళ్లారు. రెండిళ్లకూ తాళం వేసి ఉండటం గమనించి పట్టపగలు చోరీకి పాల్పడ్డారు.

**స్థానికుల గస్తీ..**కడెం మండలంలో ఇటీవల చోరీ ఘటనలతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో గ్రామస్థులు గస్తీ తిరుగుతున్నారు. ప్రతీ ఇంటి నుంచి ఒకరు చొప్పున వచ్చి బృందాలుగా విడిపోయి కాలనీలో పహారా కాస్తున్నారు. పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితం ఉండటం



లేదని, దొంగలు ఏ సమయంలో వస్తున్నారో తెలియడం లేదని వాపోతున్నారు.

**అనువుగా ఉండటంతో..**పొరుగునే మహారాష్ట్ర ఉండటం, తనిఖీ కేంద్రాలు పెద్దగా పనిచేయకపోవడంతో ఇష్టారీతిన రాకపోకలు సాగుతున్నాయి. దీనికితోడు జిల్లాలో 44, 61వ జాతీయ రహదారులు ఉన్నాయి. రవాణాపరంగా సౌలభ్యంగా ఉండటంతో ఇతర జిల్లాలకు చెందిన వ్యక్తులు నేరుగా వచ్చి దొంగతనం చేసి పారిపోతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వేసవికావడం, కూలీ పనులు అంతగా లభించకపోవడం, వ్యవసాయపనులు లేకపోవడం వంటి కారణాలతో కొందరు సులభ సంపాదనకు చోరీలవైపు మళ్లుతున్నారనే వాదనలూ లేకపోలేదు.

**అప్రమత్తతే రక్ష**వేసవి కావడంతో చాలామంది గ్రామీణ ప్రాంతాల్లోని బంధువుల ఇళ్లకు, శుభకార్యాలు, వినోదయాత్రలకు వెళ్తుంటారు. దీంతో ఇళ్లకు తాళం వేయడం తప్పనిసరి. పైగా రాత్రివేళల్లో కొందరు చల్లగాలి కోసం ఇళ్లకు తాళం వేసి ఆరుబయటనో, డాబాపైననో నిద్రిస్తుంటారు. దీన్ని గమనించే దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. అనువైన సమయం లభించగానే తాళం పగలగొట్టి ఇళ్లలోకి చొరబడుతున్నారు. జరిగిన ఘటనలు పరిశీలిస్తే ఈ విషయాలు తేటతెల్లమవుతున్నాయి. ఇళ్లకు తాళం వేసి వెళ్లాల్సివస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవడం, వ్యక్తిగతంగా అప్రమత్తంగా ఉండటమే దొంగతనాల నివారణలో కీలకం.

# ప్రైవేటులో కడుపు కోతలే..

మంచిర్యాల : జిల్లాలోని ప్రైవేటు ప్రసూతి ఆసుపత్రి నిర్వాహకులతో ఆరోగ్యశాఖ ఏర్పాటు చేస్తున్న సమావేశాలు సత్ఫలితాలు ఇవ్వడం లేదు. కోతలు తగ్గించాలంటూ ఆదేశాలివ్వడం అధికారులకు అలవాటైతే.. పెడచెవిన పెట్టడం ఆ వైద్యులకు పరిపాటిగా మారింది. ప్రైవేటులో జరుగుతున్న కోతల్లో ఏ మాత్రం మార్పు రాకపోగా మరింత పెరుగుతున్నాయి. ఈ శస్త్రచికిత్సలన్నీ జిల్లాలోని ఆరేడు ఆసుపత్రుల్లోనే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. అయినా వైద్యశాఖ చాలా 'మామూలు'గా తీసుకుంటోంది. భారీగా శస్త్రచికిత్సలు జరుగుతున్నా కనీసం ఆరా కూడా తీయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

ప్రైవేటు కేంద్రాల్లో కోతల తీరుకు ఈ లెక్కలే నిదర్శనం. 90శాతానికి పైగా శస్త్రచికిత్సలతోనే ప్రసవాలు చేస్తున్నట్లు వీటితో తెలుస్తోంది. ప్రతినెల సంఖ్య పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. ఈ ప్రసవాల్లో అధికంగా మంచిర్యాలలోని 4–5 ఆసుపత్రుల్లోనే జరుగుతుండగా



చెన్నూరులోని ఒక చోట ఎక్కువగా ఉంటున్నట్లు తేలింది. అయినా ఆరోగ్యశాఖ అధికారులు వాటిపై ఎలాంటి చర్యలు లేవు. శస్త్రచికిత్సలు చేయాల్సిన అవసరంపై ఆరా తీసే ప్రయత్నమూ చేయడం లేదు.

**ఫీజులు భారీగా..**

ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవమైనా.. శస్త్రచికిత్స ద్వారా చేసినా ఫీజుల్లో ఏ మాత్రం తగ్గడం లేదు. కానీ వైద్యులు సమయం ఆదా చేసుకునేందుకు, పని సులువుగా పూర్తి చేసేందుకు కోతలకే మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. గంటల తరబడి ఎదురుచూడలేక.. ఓపిక పట్టడం చేతకాక అయిదు నిమిషాల్లో పూర్తయ్యే శస్త్రచికిత్సలకు అలవాటుపడిపోతున్నారు. ఫీజులు ఎలాగూ తగ్గించడం లేదు. బాధితులకు సాధారణ ప్రసవాలతో కలిగే లాభాలను వివరించి వీటికే మొగ్గుచూపేలా చొరవచూపాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శస్త్రచికిత్సలు బాలింతల భవిష్యత్తు ఆరోగ్యంపై ఏ స్థాయిలో ప్రభావితం చేస్తాయో తెలిపేలా ఆరోగ్యశాఖ అవగాహన పెంచడంతోపాటు ప్రైవేటులో కోతలను తగ్గించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందంటున్నారు.గతేడాది ఏప్రిల్ నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు

ప్రైవేటు ప్రసూతి కేంద్రాల్లో జరిగిన ప్రసవాల సంఖ్య: 3954

శస్త్రచికిత్సల ద్వారా చేసినవి: 3543

సాధారణ ప్రసవాలు: 411

ప్రైవేటు ఆసుపత్రులు నెలవారీగా చేస్తున్న ప్రసవాల్లో కనీసం పదిశాతం కూడా మించడం లేదనడానికి ఈ లెక్కలే ఉదాహరణ.

# భూ అక్రమణలపై ఉక్కుపాదం

నిర్మల్ : ప్రభుత్వ భూములను దర్జాగా ఆక్రమించుకుని ఆపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై జిల్లా యంత్రాంగం కొరడా ఝుళిపిస్తోంది. కలెక్టర్ అభిలాష అభినవ్ చొరవతో జిల్లా కేంద్రంతోపాటు 18 గ్రామీణ మండలాల్లోనూ ప్రభుత్వ భూముల ఆక్రమణలపై దృష్టి సారించింది. తొలుత నిర్మల్, భైంసా, నర్సాపూర్(జి), లోకేశ్వరంలలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూముల సర్వే నిర్వహించగా.. భూ ఆక్రమణలు వెలుగులోకి వచ్చాయి. ఈ మండలాల్లో రూ.11.22 కోట్ల విలువైన 81.59 ఎకరాల ప్రభుత్వ భూములను అధికారులు స్వాధీనం చేసుకుని సంబంధిత ఆక్రమణదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. మిగతా మండలాల్లోనూ ప్రభుత్వ భూముల సర్వే కొనసాగిస్తున్నారు.

**చెరువుల శిఖంపై దృష్టి సారించాల్సిందే**

భూగర్భజలాల పెంపునకు దోహదం చేయడంతోపాటు వందలాది ఎకరాలకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో నిర్మల్‌ను పాలించిన రాజులు తవ్వించిన చెరువులు కొంతమంది అక్రమార్కులు చేస్తున్న శిఖం కబ్జా కారణంగా అవి అస్తిత్వాన్ని కోల్పోతున్నాయి. జిల్లా కేంద్రంతోపాటు మండలాల్లోని చాలా ప్రాంతాల్లోని తటాకాల శిఖం విస్తీర్ణం తగ్గిపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం ఉండటం లేదు. చారిత్రక పట్టణంగా పేరున్న నిర్మల్‌లోని గొలుసుకట్టు చెరువు శిఖం భూముల కబ్జా పర్వం కొనసాగుతూనే ఉంది. కొద్ది రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ చెరువు కొంత శిఖం భూమిని రాజకీయ పలుకుబడి ఉన్న కొంతమంది తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఇక్కడ శిఖం చుట్టూ రక్షణగా సిమెంటు స్తంభాలు ఏర్పాటుచేసినా వాటి లోపల మొరం పోసి ఆక్రమిస్తున్నారు. **చర్యలు తీసుకుంటాం: అభిలాష అభినవ్, జిల్లా కలెక్టర్**ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లాలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటివరకు నాలుగు మండలాల్లో ప్రభుత్వ భూముల ను గుర్తించి స్వాధీనం చేసుకున్నాం. జిల్లాలోని ప్రభుత్వ, రెవెన్యూ, అటవీ భూములు, చెరువు శిఖం, సాగునీటి ప్రాజెక్టులు, కాలువల భూముల ఆక్రమణలు జరగకుండా వాటి పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటాం.

# ఇందిరమ్మ ఇళ్లకు సి'మంట'

కరీంనగర్ : సిమెంట్ ధరల పెరుగుదల ప్రభావం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులపై పడనుంది. ఇప్పటికే స్థలం ఉండి ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు పనులు ప్రారంభిస్తున్నా పెరిగిన సిమెంట్ ధరలపై ఆందోళన చెందుతున్నారు. సిమెంట్ బస్తా ధర దాదాపు రూ.30 నుంచి రూ.50 వరకు పెరిగినట్లు రిటైల్ వ్యాపారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మండలానికి ఒకటి చొప్పున 60 పైలట్ గ్రామాలను ఇందిరమ్మ పథకానికి ఎంపిక చేశారు. సర్వే అనంతరం 6,416 ఇళ్లను మంజూరు చేశారు. ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ప్రభుత్వం ఇవ్వనుండగా 600 చదరపు అడుగులలోపే నిర్మించుకోవాలి. ఈ క్రమంలో ఒక ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి అయ్యేవరకు దాదాపు 200ల బస్తాల సిమెంట్ అవసరం ఉంటుందని అధికారులు ఇంటి నిర్మాణ ప్రణాళికలో పేర్కొన్నారు. లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన సమయంలో సిమెంట్ బస్తా ధర రూ.280 నుంచి రూ.330ల వరకు ఉండేది. తరవాత రూ.30 నుంచి రూ.50 వరకు ధర పెరగడంతో రూ.320 నుంచి రూ.380 వరకు చేరుకున్నాయి. దీంతో ఇంటి విస్తీర్ణాన్ని బట్టి ఒక్కో లబ్ధిదారుడికి రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు అదనపు భారం పడే అవకాశం ఉంది. ప్రభుత్వం తక్కువ ధరకు సిమెంట్ సరఫరా చేస్తే ఈ ఇబ్బంది ఉండదని లేకుంటే అదనపు భారం తప్పదని లబ్ధిదారులు వాపోతున్నారు.

మధ్య తరగతిపైనా.. ఉమ్మడి జిల్లాలో ఏటా 5 వేలకుపైగా ఇళ్లు నిర్మితమవుతుంటాయి. ఇందులో మధ్య తరగతి వారే 80 శాతం ఉంటారు. ఏటా వేసవికి ముందు ఇళ్ల నిర్మాణం ప్రారంభించి వర్షాకాలంలోగా పూర్తి చేయడానికి ఎక్కువ శాతం మంది ఏర్పాట్లు చేసుకుంటుంటారు. ఈ క్రమంలో ఈ సంవత్సరం కూడా వేలల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. సిమెంట్ ధరలు పెరగడంతో వారందరిపైనా భారం పడే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకు దాదాపు 50 వేల సిమెంట్ బస్తాలు విక్రయిస్తుంటామని వ్యాపారులు చెబుతున్నారు.

# హెచ్‌ఎండీఏ ప్లాట్లలో వసతులు మృగ్యం

హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) విక్రయించిన లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పనలో జాప్యం జరుగుతోంది. గతంలో రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజిగిరి పరిధిలోని పలు ప్రాంతాల్లో లేఅవుట్లు వేసి, వేలంలో విక్రయించింది. వ్యాపార, వాణిజ్య సంస్థలు, ప్రజలు.. రూ.కోట్లు పెట్టి స్థలాలు కొనుగోలు చేశారు. ప్లాట్లు విక్రయించిన 18 నెలల్లో వసతులు కల్పిస్తామని హెచ్‌ఎండీఏ హామీ ఇచ్చింది. రెండేళ్లు దాటినా.. పనులు ఇంకా కొలిక్కి రాలేదు. అంతర్గత రహదారులు, అప్రోచ్ రోడ్డు, తాగునీటి, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్తు, పచ్చదనం కోసం పార్కులు.. ఇలా అన్ని వసతులు కల్పించాల్సిన బాధ్యత హెచ్‌ఎండీఏపై ఉంది. తొర్రూరు, బహుదూర్‌పల్లి, మేడిపల్లి లేఅవుట్లలో ఇంకా పనులు కొనసాగుతున్నాయి. మేడిపల్లిలో పనుల్లో జాప్యంపై కొనుగోలుదారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. బుద్వేల్ వద్ద కొండపై 100 ఎకరాల్లో లేఅవుట్ కోసం రూ.400 కోట్లు వరకు వెచ్చిస్తోంది. అయితే పనుల్లో సంక్లిష్టతతో



పాటు అవుటర్‌పైకి భారీ డబుల్ డెక్కర్ ర్యాంపు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. బ్యాంకుల వద్ద అప్పులు చేసి ప్లాట్లు కొనుగోలు చేశామని, వసతుల కల్పనలో జాప్యంతో వడ్డీల భారం పెరుగుతోందని కొనుగోలుదారులు వాపోతున్నారు.

**డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని...**
టైటిల్ క్లియర్‌గా ఉండటం, ప్రభుత్వ సంస్థ భరోసా ఇస్తుండటంతో హెచ్‌ఎండీఏ లేఅవుట్లకు మంచి డిమాండ్ ఉంటోంది. ఈ క్రమంలో హెచ్‌ఎండీఏ సైతం నిబంధనలు పాటించడం లేదు. వాస్తవానికి లేఅవుట్‌లో రోడ్డు, ఇతర మౌలిక వసతులు కల్పించాకే ప్లాట్లు విక్రయించాలి. ఇవేమీ చేయకుండానే హెచ్‌ఎండీఏ స్థలాలు విక్రయిస్తోంది. ప్రైవేటు లేఅవుట్‌లో ప్లాట్లు విక్రయించాలంటే 10 శాతం ప్లాట్లు హెచ్‌ఎండీఏ వద్ద మార్టిగేజ్ చేయాలి. ఒకవేళ సదరు ప్రైవేటు సంస్థ.. మౌలిక వసతులు కల్పించకపోతే... ఈ తనఖా ప్లాట్లను హెచ్‌ఎండీఏ విక్రయించి ఆ నిధులతో సౌకర్యాలు కల్పిస్తుంది. ఈ నేపథ్యంలో మౌలిక వసతులు లేకుండా ప్రీలాంచ్ పేరిట ప్లాట్ల విక్రయాలపై నిషేధం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో స్వయంగా హెచ్‌ఎండీఏనే వసతులు కల్పించకుండానే ఒకరకంగా ప్రీలాంచ్ పేరిట ప్లాట్లను విక్రయిస్తుండటం గమనార్హం.

# చెరిపేసి హద్దులు.. కుంటలో వాలిన గద్దలు


దేవరకొండ : కాకతీయుల కాలం నాటి చెరువులు, కుంటలు కబ్జా కోరల్లో చిక్కుకుంటున్నాయి.ఆక్రమణలతో శిఖం భూములు ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. నల్గొండ-నాగర్‌కర్నూల్ జిల్లా సరిహద్దులోని డిండి ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలో 25.19 ఎకరాల కుంట అక్రమార్కుల చేతిలోకి వెళ్లింది. ప్రాజెక్టు ప్రాంతాలను ఆవరించి ఉన్న కుంట భూమిని స్థిరాస్తి వ్యాపారులు ఆక్రమించుకొని వెంచర్ చేయడంతోపాటు ప్రభుత్వం అందించే అనేక ఫలాలను పొందుతున్నారు. దేవరకొండ నియోజకవర్గం డిండి ప్రాజెక్టులో ప్రభుత్వ భూమిని కొందరు అక్రమార్కులు చెరబట్టి కాసుల పంట పండించుకుంటున్నారు. ధనకుంటలోని సర్వే నెం.14లో దాదాపు 25.19 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూమి స్థిరాస్తి వ్యాపారులకు కాసుల వర్షం కురిపిస్తుంది. ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేసి రైతుబంధు, పంట రుణాలు, ప్రకృతి విపత్తుల సమయంలో అందించే సాయం అందిపుచ్చుకుంటున్న అక్రమార్కులపై అధికారులు మాత్రం మిన్నకుండిపోతున్నారు. ధనకుంట పరివాహక ప్రాంతంలో చిన్నాపెద్ద 11 కుంటల ద్వారా వరద నీరు ఈ కుంటలో నిల్వ ఉంటుంది. 300 ఎకరాల మేర సాగునీటి వసతి కల్పించడమే కాకుండా చేపల వేట వృత్తి కొనసాగించే వారికి జీవనోపాధిగా ఉన్న ఈ చెరువు ఆయకట్టును డిండి ప్రాజెక్టు ఎడమకాల్వ పరిధిలో నికర ఆయకట్టుగా మార్చి కుంటను క్రమంగా కబ్జాను చెరపట్టారని గ్రామస్థులు, రైతులు ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొందరు రెవెన్యూ అధికారులు, నీటి పారుదలశాఖ అధికారుల సహకారంలో శిఖం భూమిని పట్టా భూమిగా మార్చుకొని సొంతం చేసుకున్నారనే విమర్శలున్నాయి.

**కబ్జా చేస్తే చర్యలు..** - రమణారెడ్డి, ఆర్డీవో
డిండి ధనకుంట చెరువులో యంత్రాలతో పనులు చేస్తే చర్యలు తప్పవు. డిండిలోని ధనకుంటను కొందరు స్థిరాస్తి వ్యాపారులు ప్లాట్లు చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమే. ఇప్పటికే సంబంధిత రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నాం. సంబంధిత స్థిరాస్తి వ్యాపారులు దస్త్రాలు తీసుకొని రావాలని ఆదేశించాం.

**కలెక్టర్‌కు రిపోర్టు పంపాం- ఆంజనేయులు, తహసీల్దార్, డిండి**
ధనకుంట చెరువుకు సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు రిపోర్టు చేశాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలుంటాయి.

# పల్లెతాటి.. పట్టణంలో మేటి..!

నడిగూడెం : వేసవిలో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు ఎక్కువగా తాటి ముంజులు తీసుకుంటారు. ముంజలు తినడం వల్ల ఒంటికి చలవతో పాటు ఎండ నుంచి శరీరాన్ని కాపాడుకోవచ్చని భావిస్తుంటారు. తాటి ముంజలకు కేంద్రంగా బృందావనపురం ప్రసిద్ధి చెందింది. ఇక్కడి గీత కార్మికులు



తాటి చెట్టు పైనుంచి కాయలు తెచ్చి ఆటోల్లో కోదాడ, ఖమ్మం, సూర్యాపేట వంటి పట్టణాలకు తీసుకెళ్లి ముంజలను తీసి ప్రజలకు విక్రయిస్తున్నారు. రహదారుల వెంట, కూడళ్లలో ముంజలతో వ్యాపారం చేస్తున్నారు. ఖర్చులన్ని పోనూ నిత్యం రూ.2 వేల వరకు ఆదాయం వస్తుండటంతో వేసవిలో గీత కార్మికులు మంచి ఉపాధి పొందుతున్నారు. 7 గంటలకే ముంజ కాయలను ఆటోల్లో వేసుకుని పట్టణాలకు తరలిస్తున్నారు. కాయలు విక్రయించి తిరిగి ఇంటిదారి పడతారు. ఇలా ఒక్క బృందావనపురం గ్రామం నుంచి 50 కుటుంబాలు ముంజల వ్యాపారంలో నిమగ్నమయ్యాయి. ఇక్కడ ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లో అధిక శాతం తాటివనాలు ఉండటంతో గీత కార్మికులు ప్రత్యేక ఉపాధి పొందుతున్నారు.

# రోగాలను మూటగట్టి.. ప్రాణాలను పణంగా పెట్టి



హైదరాబాద్ : కాసుల కక్కుర్తితో కొన్ని ఆసుపత్రులు పర్యావరణం, ప్రజారోగ్యం పాలిట ముప్పుగా మారిన జీవ వ్యర్థాల (బయో మెడికల్ వేస్ట్) నిర్వహణను గాలికొదిలేశాయి. శుద్ధి కేంద్రాలకు తరలించకుండా మున్సిపల్ వ్యర్థాలతో పాటు కలిపేయడంతో మూసీనది ఒడ్డున పారబోస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. పాతనగరంలోని కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇది నిత్యకృత్యంగా మారింది. నగరంలోని కొన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ వ్యర్థాలు సంచుల్లో పోగు చేసి అలాగే వదిలేస్తుండటం గమనార్హం.

ఇవీ బయో వ్యర్థాలు
రక్తంతో కూడిన శరీర భాగాలు
కాటన్, డ్రెస్సింగ్ మెటీరియల్
ప్లాస్టర్లు, వాడిన సిరంజీలు
కాలం చెల్లిన ఔషధాలు, సూదులు, బ్లేడులు

**అనర్థాలివే..**
హెచ్ఐవీ రోగులకు వాడిన సూదులు, బ్లేడులు బయటపడేస్తే ఇతరులకు గుచ్చుకొని ఆ రోగాలు సోకే ప్రమాదం ఉంది. హెపటైటిస్ బి వంటి రోగాలు ప్రబలుతాయి. చీము తుడిచిన కాటన్‌లోని ఫంగస్ ఇతరులకు వ్యాపిస్తుంది. వ్యర్థాల్లోని బ్యాక్టీరియా, వైరస్ ఇతరులకు త్వరగా వ్యాపించి జీర్ణకోశ, శ్వాసకోశ చర్మ వ్యాధులు ప్రబలుతాయి.

**ఏం చేయాలంటే..**
జీవ వ్యర్థాలను నిర్దేశిత రంగులు కలిగిన డబ్బాల్లో నిల్వ చేసి సంబంధిత ఏజెన్సీలకు 48 గంటల్లోపు పంపాలి.
పసుపు: మానవ, శరీర అవయవాలు, రక్తంతో కూడిన భాగాలు, ప్రయోగశాలల వ్యర్థాలు
ఎరుపు: రక్తంతో తడిసిన సామగ్రి, కాటన్, డ్రెస్సింగ్ మెటీరియల్, ప్లాస్టర్లు, సిరంజిలు, ప్లాస్టిక్ వ్యర్థాలు.
నలుపు: కాలం చెల్లిన మందులు, సూదులు, బ్లేడ్లు, ఇతర పదునైన వస్తువులు.
నేరేడు: క్యాన్సర్ మందులు, ఆ వ్యర్థాలు.

**నిబంధనల ప్రకారం..**
ఆసుపత్రుల వ్యర్థాల నిర్వహణకు కామన్ మెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీస్ కేంద్రాలను నగరంలో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల నుంచి నిర్వాహకులు నిత్యం ఆసుపత్రుల వ్యర్థాలను సేకరించాలి. ఇందుకు ఆసుపత్రులు ప్రతి పడకకు కొంత మొత్తం చెల్లించాలి. ఆసుపత్రులు నిబంధనలు పాటిస్తున్నాయంటూ ఈ కేంద్రాల నిర్వాహకులు ధ్రువీకరణ పత్రం జారీ చేయాలి. సమాచారాన్ని పీసీబీకి సమర్పించాలి. అయితే ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో ఎక్కడా జరగడం లేదు.

**పాతనగరంలోనే ఎక్కువ**
పాతనగరంలో అనేక క్లినిక్‌లు, ఆసుపత్రుల్లో పరిస్థితి దారుణంగా ఉంది. హైకోర్టు ఎదురుగా మూసీ ఒడ్డున బయో వ్యర్థాల కుప్పలు దర్శనమిస్తున్నాయి. వర్షాలు పడినప్పుడు అవి మూసీలో తేలియాడుతూ కనిపిస్తున్నాయి. రోజుల తరబడి పడి ఉన్నా తొలగించకపోవడం గమనార్హం.

**నిత్యం మూడు టన్నులు..**
నగరంలోని ఆసుపత్రుల్లోని ఒక్కో పడక నుంచి ప్రతిరోజూ 500 గ్రాముల వరకు వ్యర్థాలు వెలువడుతున్నాయని పీసీబీ అధికారులు లెక్కగట్టారు. అన్ని ఆసుపత్రులు కలిపి మూడు టన్నుల వరకు బయో వ్యర్థాలు ఉంటున్నాయి. ఇందులో నిత్యం 15 నుంచి 20శాతం చెత్తతో పాటే కలిసిపోతున్నాయి.

**ఫిర్యాదు చేయొచ్చు ఇలా..**
బయో మెడికల్ వ్యర్థాలు పారేస్తున్నట్టు కనిపిస్తే ప్రజలు నేరుగా కాలుష్య నియంత్రణ మండలి నైట్ పెట్రోలింగ్ బృందం ఫోన్ నంబరు 9866776755 కు ఫిర్యాదు చేయొచ్చు. లేదా పీసీబీ కార్యాలయం 040 23887500 నంబర్‌కు సమాచారం ఇవ్వవచ్చు. పీసీబీ జనవాణి కాలుష్య నివారిణి వెబ్‌సైట్‌లో ఫొటోతో ఫిర్యాదు చేయవచ్చు.

# కనుమరుగవుతున్న తటాకాలు



హైదరాబాద్ : ఇది రాళ్లగూడ జోషీ కుంట. శంషాబాద్ రెవెన్యూ సర్వే నంబరు 325లో 7.29 ఎకరాల విస్తీర్ణంలో ఓఆర్ఆర్‌ను ఆనుకొని ఉంది. తాగు, సాగునీరు అందించిన ఈ తటాకం ప్రస్తుతం 2 ఎకరాలకు చేరింది. క్రమేణా కనుమరుగయ్యే అవకాశం ఉంది. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసి కుంటను పరిరక్షించాలని స్థానికులు పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఇటీవల నిర్మాణంలో ఉన్న ఓ భవనాన్ని మున్సిపల్, రెవెన్యూ అధికారులు సీజ్ చేసి ఫ్లెక్సీలను ఏర్పాటు చేసినా పనులు యథావిధిగా కొనసాగుతున్నాయి. జీవో నంబరు 111 ప్రకారం నిషేధం ఉన్నా.. జీవో నంబరు 111 పరిధిలో ఉన్న శంషాబాద్‌లో భవన నిర్మాణాలకు అనుమతులను ప్రభుత్వం నిషేధించింది. అంతర్జాతీయ విమానాశ్రయం, బాహ్య వలయ రహదారి నిర్మాణంతో స్థిరాస్తి వ్యాపారుల కన్ను శిఖం భూములపై పడింది. చెరువులకు ఆనుకొని ఉన్న పట్టా భూములను కొనుగోలు చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు సీజ్ చేసినా తగ్గడం లేదు.

**పూర్వవైభవం కోసం రూ.6.30 కోట్లు..** శంషాబాద్ మున్సిపల్, మండల పరిధిలో కాకతీయుల హయాంలో 70కిపైగా చెరువులు, కుంటలు నిర్మించారు. ఆనవాళ్లు కోల్పోతున్నా జల వనరులకు పూర్వ వైభవం తీసుకురావాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం 2014లో మిషన్ కాకతీయ పథకాన్ని చేపట్టింది. 2017 వరకు దశలవారీగా 65 చెరువుల అభివృద్ధికి సర్కార్ రూ.6.30 కోట్లు కేటాయించింది.

**కబ్జాకు యత్నించిన వారిపై కఠిన చర్యలు**- మౌనిక, సహాయ ఇంజినీర్, నీటిపారుదల శాఖ జల వనరుల కబ్జాకు యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. రాళ్లగూడ జోషీ కుంట, శంషాబాద్ కాముని చెరువు, రామాంజపూర్ వెంకట చెరువు, రషీద్‌గూడ చామ చెరువు శిఖం భూములను కబ్జాకు యత్నించిన వారిపై కేసులు నమోదు చేశాం.

# 3 నెలలే లక్ష్యం.. అభివృద్ధి పనులు నిత్యం



హైదరాబాద్: అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద నగరంలో చేపట్టిన రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి పనులు వడివడిగా సాగుతున్నాయి. మూడు నెలల్లో హఫీజ్‌పేట్, హైటెక్‌సిటీ పనులు పూర్తి చేసే లక్ష్యంతో పనులు జరుగుతున్నాయని దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు. ఇప్పటికే బేగంపేట్ పనులు 90శాతం పూర్తవగా...మల్కాజిగిరి, మలక్‌పేట్, ఉప్పుగూడలో పనులు కొనసాగుతున్నాయి. హైదరాబాద్ (నాంపల్లి) స్టేషన్ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ నిర్దేశాలకు ప్రయాణికుల కోసం అత్యాధునిక మరుగుదొడ్లు, 12 మీటర్ల వెడల్పు ర్యాంపుతో పాదచారుల వంతెన, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ప్లాట్‌ఫామ్ మొత్తానికి షెడ్డు నిర్మాణం, స్టేషన్ బయట పచ్చిక బయళ్లు, నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ నిర్దేశాలకు అనుగుణంగా మురుగునీటి శుద్ధికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంఎంటీఎస్ స్టేషన్లలో దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా అభివృద్ధి చేస్తున్నారు. ఎంఎంటీఎస్ స్టేషన్లకు ఇరువైపుల నుంచి చేరుకునేలా రోడ్లు, 6 మీటర్ల వెడల్పుతో కొత్త వంతెనలు, లిఫ్టులు సమకూరనున్నాయి.

బేగంపేట స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, లిఫ్ట్, ఎస్కలేటర్, స్టేషన్‌భవనం పనులు పూర్తయ్యాయి. శౌచాలయాల బ్లాక్‌ల నిర్మాణం పురోగతిలో ఉంది. హైటెక్‌సిటీ స్టేషన్ పనులు సుమారు 75శాతం పూర్తయ్యాయి. హఫీజ్‌పేట్‌లో 73శాతం పనులు పూర్తయినట్టు అధికారులు వెల్లడించారు. మే నెలాఖరుకల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. షాద్‌నగర్‌లో 57శాతం పూర్తయ్యాయి. పే అండ్ యూజ్ టాయిలెట్ నిర్మాణ పనులు పూర్తికాగా, స్టేషన్ భవనం, లిఫ్ట్ పనులు పురోగతిలో ఉన్నాయి.

**హైదరాబాద్ స్టేషన్‌లో షురూ..** కొత్త భవనం నిర్మాణంతో పాటు మెరుగైన సదుపాయల కల్పన దిశగా నాంపల్లి స్టేషన్ పునరాభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. 16 లిఫ్టులు, 8 ఎస్కలేటర్ల నిర్మాణాలు చేపడుతున్నారు. 328 చ.మీ.ల విస్తీర్ణంలో ఉన్న వేచి ఉండే ప్రాంతాన్ని 1,450 చ.మీ.లకు పెంచుతున్నారు. 900 ద్విచక్ర వాహనాలు, 210 నాలుగు చక్రాల వాహనాలు నిలిపేలా పార్కింగ్‌ను ఉండేలా అభివృద్ధి చేస్తున్నారు. పాత భవనాల కూల్చివేత పనులు, బారికేడింగ్ పనులు కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు.

# వైద్యులు లేక కోఠి పాట్లు

సుల్తాన్‌బజార్ : కోఠిలోని ఈఎన్‌టీ (చెవి, ముక్కు, గొంతు) ఆసుపత్రి అత్యాధునిక పరికరాలు, వసతులతో రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తూ పేరుగాంచింది. దవాఖానాలో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. వైద్య సేవలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఓ వైపు వైద్యులు, మరో వైపు ఫార్మసిస్టుల ఖాళీల భర్తీలో జాప్యం రోగుల పాలిట శాపంగా మారుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాధారణ బదిలీలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న వారు వేరే ప్రాంతాలకు వెళ్లి పోయారు.

నిత్యం కిటకిట.. : వివిధ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే రోగులతో దవాఖానా నిత్యం రద్దీగా ఉంటుంది. ఔట్‌పేషంట్(ఓపీ) విభాగంలో సోమ, మంగళవారాల్లో 1800-2000 మంది, సాధారణ రోజుల్లో 1200-1500 మంది రోగులు వస్తుంటారు. ఇన్‌పేషంట్(ఐపీ)లో సుమారు 150 మంది వరకు చికిత్స పొందుతుంటారు. సరిపడా వైద్యులతో పాటు ఫార్మసిస్టులు లేక ఆయా




విభాగాల్లో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఫార్మసీ వద్ద బారులు: ప్రస్తుతం ఇద్దరు ప్రొఫెసర్లు, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు అందుబాటులో ఉన్నారు. నర్సింగ్ సిబ్బంది కూడా అంతంత మాత్రమే. కీలకమైన ఫార్మసిస్టుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. నలుగురు ఉండాల్సిన చోట ఒక్కరూ లేరు. రోగులు మందుల కోసం ఫార్మసీ వద్ద బారులు తీరాల్సిన పరిస్థితి. ఫార్మసిస్టులు లేక ఓపీ, ఐపీ, మెడికల్ స్టోర్, సబ్ స్టోర్, సర్జికల్ స్టోర్, ఆపరేషన్ థియేటర్‌లపై ప్రభావం పడుతోంది. ఆసుపత్రిలో చిన్నారులకు ఖరీదైన కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్లు వారంలో మూడు సార్లు నిర్వహిస్తారు. దానికి అవసరమయ్యే ఖరీదైన మందుల నిర్వహణకు ఫార్మసిస్టు లేరు. ప్రస్తుతం ఆసుపత్రి ఆర్ఎంఓ మెడికల్ స్టోర్ బాధ్యతలు చూస్తున్నారు. రెండు రేడియోగ్రాఫర్ల పోస్టులు ఖాళీగా ఉండటంతో ఎక్స్‌రే, సీటీ స్కాన్‌కు రోగులకు పాట్లు తప్పడం లేదు. ఆరోగ్యశ్రీ ద్వారా ఒప్పంద పద్ధతిలో ఒక్కొక్కరిని నియమించి ఆయా విభాగాలను నెట్టుకొస్తున్నారు. ఖాళీల భర్తీపై ఆసుపత్రి టీఎన్జీవో యూనిట్ ప్రతినిధులు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేసినా విన్నవించినా ఫలితం లేకుండా పోతోంది.

# పట్టణమందు.. ప్రకృతి విందు

నల్గొండ : పట్టణాలు కాంక్రీటు అరణ్యాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో నలొండ జిల్లాలో నీలగిరి, మిర్యాలగూడ, దేవరకొండ పురపాలికల్లో మినహా మిగతా పట్టణాల్లో ఉద్యానాలు లేక ప్రజలకు ఆహ్లాదం కరవవుతోంది. నల్గొండ, దేవరకొండ పురపాలికల్లో రూ.కోట్ల నిధులతో ప్రజలకు ఆహ్లాదం అందించే పార్కులను తీర్చిదిద్దారు. నీలగిరిలో రూ.4 కోట్లతో అభివృద్ధి పర్చిన చర్లపల్లి అర్బన్ పార్కు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. మిగతా పార్కుల్లో సందర్శకుల సందడి నెలకొంది. మిర్యాలగూడలో మాత్రం నిర్వహణ లేమితో పార్కు మసకబారిపోయింది. సామగ్రి శిథిలావస్థకు చేరింది. పచ్చదనం మాడిపోయి అధ్వానంగా మారింది.

గోవా తీరంలో బీచ్ అందాల మాదిరిగా.. నీలగిరిలో పార్కులు ఆహ్లాదంగా మారాయి. నల్గొండ సుందరీకరణలో భాగంగా మున్సిపల్ యంత్రాంగం రాంనగర్, రాజీవ్ పార్కులు పునరుద్ధరణ పనులు చేపట్టింది. వాటికి తోడు కలెక్టర్ భవనం ముందు పంచతత్వ పార్కు, మైసయ్య విగ్రహం పక్కన ఎమిరాల్డ్ పార్కు, శ్రీనగర్‌కాలనీ, శివాజీనగర్ పార్కులను రూ.కోట్ల నిధులతో అభివృద్ధి పర్చారు. అ ఉద్యానాలు ఇప్పుడు కనువిందు చేస్తున్నాయి. రాంనగర్, రాజీవ్‌పార్కులు పచ్చదనంతో నిండిపోయాయి. పచ్చని చెట్ల మధ్యన అందంగా నిర్మించిన గజీబో కనువిందు చేస్తు ప్రజలను ఆకర్షిస్తోంది. పార్కులలో రంగు రంగుల దీపాల కాంతులు, మ్యూజిక్ ఫౌంటెన్ వినసొంపు సంగీతాన్ని అందిస్తుంది. ఆంధ్ర ప్రాంతం నుంచి తెప్పించిన పూల మొక్కలు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. నడకదారి నిర్మాణంతో పాటు ప్రజలను ఆకర్షించేలా విహార ప్రదేశంగా తీర్చిదిద్దారు. అందమైన పూల మొక్కలు రాత్రి వేళ ఎల్ఈడీ వెలుగులు పిల్లల ఆడుకోవాడనికి ఆట స్థలం, కూర్చోడానికి సిట్టింగ్ ఏర్పాటు చేశారు. ఓపెన్ జిమ్‌లు ఏర్పాటుతోపాటు ప్రహరీకి రంగు రంగుల పెయింటింగ్ వేశారు.. సాయంత్రం ఆహ్లాదకరక వాతవరణం ఉట్టిపడేలా ఉండటంతో జిల్లా వాసులు వచ్చి సేదతీరున్నారు.నల్గొండ రాంనగర్ పార్కు సినిమాలు, వీడియో సాంగ్స్, ప్రి వెడ్డింగ్ షూటింగ్‌కు వేదికగా మారింది. సందర్శకులకు ఫుడ్‌కోర్టు సైతం ఏర్పాటు చేశారు. నల్గొండ పురపాలికకు రెండు పార్కుల ప్రవేశ రుసుం రూపేణా నిత్యం రూ.5వేల నుంచి రూ.10 వేల వరకు ఆదాయం సమకూరుతోంది. చర్లపల్లి అర్బన్ పార్కు సైతం ప్రారంభిస్తే మరింత ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

# ఖరీఫ్.. ఖరారు

రాజపేట : జిల్లాలో వానాకాలం పంటల సాగుకు వ్యవసాయ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. గత వానాకాలం సీజన్‌లో వ్యవసాయ శాఖ పరంగా 4,40,500 ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని అంచనా వేయగా, 4,25,144 ఎకరాల్లో వివిధ పంటలు సాగు అయ్యాయి. ఈ సారి మొత్తంగా 4,40,000 ఎకరాల్లో ఆయా రకాల పంటలు సాగవనున్నట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే 'రైతు ముంగిట శాస్త్రవేత్త' పేరుతో జిల్లాలోని రైతుల వద్దకు శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వచ్చి సూచనలు చేస్తున్నారు.

మరికొద్ది రోజుల్లో రోహిణీ కార్తె సమీపిస్తుండటం, వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటుండటంతో సంబంధిత శాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. ఈ విషయమై రైతు వేదికల ద్వారా ప్రతి మంగళవారం రైతులకు సీజన్ల వారీగా ఆయా పంటల సాగుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తుం డటం తెలిసిందే. శాస్త్రీయ పద్ధతిలో సాగు చేపడితే తక్కువ పెట్టుబడితోపాటు అధిక ప్రయోజనాలుంటాయని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. ఈ సమయంలో వేసవి దుక్కుల ప్రాధాన్యం అధికంగా ఉంటుందన్నది వాస్తవం. వేసవిలో భూయాజమాన్య పద్ధతులతో మొక్కలకు మేలు చేసే జీవరాశులు పెరగడంతో పాటు హాని చేసే జీవరాశులను నిర్మూలించే అవకాశం ఉంటుంది. వానాకాలం సాగు ప్రణాళికను రూపొందించడంతో పాటు పలు రకాలుగా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనల్లో, రైతువేదికల ద్వారా వేసవి దుక్కులు, ఎరువుల వాడకం, పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లుగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ 'న్యూస్‌టుడే'తో వెల్లడించారు.

# పనుల్లో నిర్లక్ష్యం.. నాణ్యతకు తిలోదకాలు

హైదరాబాద్: రూ.వందల కోట్లకు ప్లాట్లను విక్రయించిన హెచ్ఎండీఏ మౌలిక వసతుల పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. గడువు దాటినా ఇంకా సగం పనులు కూడా పూర్తి కాకపోవడం.. పనుల్లో నాణ్యత లేకపోవడంతో ప్లాట్ల యజమానులు మండిపడుతున్నారు. ఈ మేరకు హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ దృష్టికి తమ సమస్యలను వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తీసుకెళ్లారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లిలో సర్వే నంబరు 62(62/2) ల్యాండ్ పూలింగ్ స్కీం కింద 56.28 ఎకరాల్లో లేఅవుట్‌ను హెచ్ఎండీఏ చేపట్టింది. ఇందులో 434 ప్లాట్లను రెండు ఫేజ్‌లుగా 2023 ఫిబ్రవరి, జూన్ నెలల్లో ఆన్‌లైన్‌లో విక్రయించగా చాలామంది ముందుకొచ్చి వీటిని కొనుగోలు చేశారు. ఒక్కో గజం రూ.45 వేల పైనే పలికింది. ప్లాట్లు విక్రయించిన 18 నెలల్లోపు మౌలిక వసతులు కల్పిస్తామని హెచ్ఎండీఏ కొనుగోలుదారులకు హామీ ఇచ్చింది. గడువు 2024 జులైతో ముగిసింది. అభివృద్ధి పనుల్లో భాగంగా భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు, విద్యుత్తు, వీధి దీపాలు, పార్కులు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. మొత్తం రూ.15 కోట్ల నిధులతో మౌలిక వసతులు కల్పిస్తున్నారు.



పనుల్లో నిర్లక్ష్యం చూపుతున్నారని, నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆరోపిస్తోంది. డ్రైనేజీ పైపులైన్లు నిర్మించే ముందు పైపుల కింద డస్ట్‌తో బెడ్ వేయాలని, అయితే ఎలాపడితే అలా పనులు చేస్తున్నారని అసోసియేషన్ అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి అన్నారు. పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. రెండేళ్ల గడుస్తున్నా రోడ్లు, విద్యుత్తు, భూగర్భ డ్రైనేజీ పనులను పూర్తి చేయలేదని తెలిపారు. లేఅవుట్‌లో తొలుత ఓవర్‌హెడ్ ట్యాంకు, సంపు నిర్మిస్తామని హామీ ఇచ్చారని ప్రస్తుతం ఆ పనులకు కూడా తిలోదకాలు ఇస్తున్నారన్నారు. సీపీఆర్ఐ పర్వతాపూర్ 60 అడుగుల అప్రోచ్ రోడ్డు సమస్యను కూడా పరిష్కరించలేదన్నారు. లేఅవుట్‌లో 2 ఎకరాల వాటర్ లాగింగ్ అయ్యే ప్రాంతంలో భవన వ్యర్థాలతో పూడ్చి ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. తక్షణం తమ సమస్యలు పరిష్కరించాలని హెచ్ఎండీఏ కమిషనర్‌కు అందించిన వినతిలో కోరారు.

# దరఖాస్తు చేసి.. వెనుకడుగేసి!

కరీంనగర్ : సౌరశక్తి ఉత్పత్తిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్కువగా దృష్టి సారించాయి. సౌర విద్యుత్తు యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహికులకు కేంద్రం సహకారం అందిస్తోంది. పీఎం కుసుమ్ ద్వారా పంట పొలాల్లో సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించడంతోపాటు దరఖాస్తులు ఆహ్వానించింది. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 592 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తామని 465 దరఖాస్తులు వచ్చాయి.

ఉమ్మడి జిల్లాలో సౌరశక్తి ద్వారా విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి చాలామంది ఔత్సాహికులు ముందుకొచ్చారు. 465 దరఖాస్తులు రాగా అత్యధికంగా కరీంనగర్ జిల్లా, అత్యల్పంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో వచ్చాయి. దరఖాస్తుదారులందరికీ సౌర యూనిట్లు స్థాపనకు అవకాశం కల్పిస్తారా? లేదా చూడాలి. రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకొని ఉమ్మడి జిల్లాకు కోటా కేటాయిస్తారా? లేక జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తుదారులందరికీ అవకాశం ఇస్తారా? అనే విషయంపై స్పష్టత లేదు. అధికారులు మాత్రం జిల్లాల వారీగా వచ్చిన ఈఎండీ చెల్లించిన దరఖాస్తుదారులందరికీ అవకాశం ఇస్తారని అంటున్నారు.



ఒక్కో మెగావాట్ సౌరవిద్యుత్తు ఉత్పత్తికి రూ.3.50 కోట్ల ఖర్చు అవుతుందని అంచనాలు రూపొందించారు. ఇందుకు బ్యాంకుల ద్వారా రుణం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదట్లో ఒక్కో మెగావాట్‌కు అయ్యే ఖర్చులో పది శాతం లబ్ధిదారులు చెల్లిస్తే 90 శాతం బ్యాంకుల నుంచి రుణం అందేలా చూస్తామని చెప్పారు. ప్రస్తుతం యూనిట్‌కు అయ్యే ఖర్చులో 30 శాతం దరఖాస్తుదారుడు చెల్లిస్తే మిగిలిన 70 శాతం బ్యాంకులు రుణాలుగా ఇవ్వనున్నాయని సమాచారం. దీంతో ఒక్కో మెగావాట్‌కు రూ.3.50 కోట్లు ఖర్చు అవుతుండగా ఇందులో రూ.1.05 కోట్లు దరఖాస్తుదారుడు భరించాల్సి ఉంటుందని సమాచారం. సౌరశక్తి ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న ఔత్సాహికులు ఈ నెల 16లోగా ఒక్కో మెగావాట్‌కు ఎర్నెడ్ మనీ డిపాజిట్ (ఈఎండీ) కింద రూ.లక్ష చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకు రుణం తిరిగి చెల్లించాలని, రాయితీ లేదని తెలిసి.. రెండో దశ ఈఎండీ దరఖాస్తు చేయడానికి వెనుకంజ వేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 11 వరకు 78 దరఖాస్తులు, 97.5 మెగావాట్ల సౌరశక్తి యూనిట్ల ఏర్పాటుకు రూ.లక్ష చొప్పున చెల్లించారు. ఇందులో అత్యధికంగా కరీంనగర్ జిల్లా ఉండగా అత్యల్పంగా పెద్దపల్లి జిల్లా ఉంది. ఈనెల 16 వరకు ఉండటంతో మరిన్ని దరఖాస్తులకు సంబంధించి ఈఎండీ చెల్లిస్తారని రెడ్కో అధికారులు భావిస్తున్నారు.

# ఈసారైనా గ్రహణం వీడేనా?



బొంరాస్‌పేట : మండల కేంద్రంలో ఇంటర్ తరగతుల ప్రారంభంపై సందిగ్ధం నెలకొంది. రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించాక గతేడాది బొంరాస్‌పేటకు జూనియర్ కళాశాల మంజూరు చేశారు. 2024–25 విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించడానికి అధికారులు జడ్పీ ఉన్నత పాఠశాలలోని అందుబాటులో ఉన్న గదులను పరిశీలించారు. గతేడాది జూన్, జులైలో 30 మంది వరకు విద్యార్థులు వివిధ కోర్సుల్లో చేరారు. కళాశాలకు ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు, బోధనేతర సిబ్బందిని నియమించకపోవడంతో చేరిన విద్యార్థులూ టీసీలు తీసుకొని ఇతర కళాశాలల్లో చేరారు. గత విద్యా సంవత్సరం తరగతులు ప్రారంభం కాకుండానే ముగిసింది.

**అధ్యాపకుల నియామకంలో జాప్యం..**

కళాశాల మంజూరైనా అధ్యాపకుల నియామకంలో జాప్యం నెలకొంది. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీతోపాటు వృత్తివిద్యా కోర్సులైన ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ కోర్సులు మంజూరు చేశారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఆయా కోర్సుల్లో 80 మంది చొప్పున చేర్చుకోవచ్చు. కళాశాలకు ప్రిన్సిపల్‌తోపాటు 13 మంది అధ్యాపకులు, అయిదుగురు బోధనేతర సిబ్బంది అవసరం. నేటికీ వారిని నియమించలేదు. జూన్‌లో మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో సిబ్బందిని నియమిస్తారా.. లేదా.. అన్న అనుమానం కలుగుతోంది. మండలం నుంచి ఈసారి 400 మందికిపైగా 10వ తరగతి పరీక్షలు రాశారు. పాసైనవారంతా మళ్లీ ఇతర పట్టణాలకు వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడింది.

**పునాదులు దాటని భవన నిర్మాణం..**

జూనియర్ కళాశాలకు సొంత భవనం నిర్మించేందుకు ప్రభుత్వం రూ.4.72 కోట్లు మంజూరు చేసింది. తుంకిమెట్ల మదర్సా వెనుక భాగంలోని స్థలంలో భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. నెమ్మదిగా సాగుతుండడంతో రెణ్నెల్లయినా పునాదుల దశ దాటడం లేదు. పూర్తి కావడానికే దాదాపు ఏడాది పట్టొచ్చని పలువురు చెబుతున్నారు. అప్పటి వరకు కళాశాలను ఎక్కడ కొనసాగిస్తారనే దానిపై స్పష్టత లేదు.

**తరగతులు ప్రారంభమవుతాయి.. శంకర్ నాయక్, జిల్లా ఇంటర్ అధికారి**

వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. ప్రభుత్వం పోస్టులను మంజూరు చేసింది. వాటిని భర్తీ చేయాలి. ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారు.

# కవల పల్లెలు.. ఆవాసాలే ఎల్లలు



సుల్తానాబాద్ : పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం నారాయణరావుపల్లి, కరీంనగర్ జిల్లా గ్రామీణ మండలంలోని మద్దులపల్లి గ్రామాల మధ్య రహదారి మాత్రమే అడ్డు. దారికి ఇరువైపులా ఉండే ఇళ్లు రెండు జిల్లాల పరిధిలోకి వస్తాయి. దీంతో కొత్త వారు వచ్చినపుడు ఏ ఇల్లు, ఏ జిల్లా పరిధిలోకి వస్తుందనే గందరగోళం కనిపిస్తుంది. రహదారి పరిశుభ్రత, నిర్వహణను నెలలో రెండు పంచాయతీల పారిశుద్ధ్య కార్మికులు పదిహేను రోజుల చొప్పున చూస్తారు. అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి గ్రామానికి వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు తమ పరిధి ఎక్కడివరకో తెలియక అయోమయానికి గురవుతారు. రెండేళ్ల కిందట మానేరు వాగులో తాగునీటి బోరుబావి తవ్వే సమయంలో ఇలాంటి గందరగోళమే కనిపించింది. చివరకు కరీంనగర్ ఎమ్మెల్యే, నాటి మంత్రి గంగుల కమలాకర్ శంకుస్థాపన చేశారు.

గ్రామాలు.. పంచాయతీలే కాదు, మండలాలు.. జిల్లాలు కూడా వేర్వేరు.. అయినా రెండూళ్లు కలిసే ఉంటాయి. ఒక్క చోటనే కనిపిస్తూ ఆకట్టుకుంటాయి. వివిధ పనులపై అక్కడికి వచ్చే కొత్తవారే కాదు, ప్రభుత్వ పథకాల అమలుకు వచ్చే అధికారులు కూడా హద్దులు తెలియక అయోమయానికి గురవుతుంటారు. పెద్దపల్లి జిల్లాలోని పలు గ్రామాల సరిహద్దులు జనావాసాల మధ్యే ఉండటం అబ్బురపరుస్తోంది.

**రాజీవ్ రహదారే సరిహద్దు**

సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి, భూపతిపూర్ గ్రామాల సరిహద్దులు కలిసే ఉంటాయి. రెండూళ్ల మధ్య నుంచి రాజీవ్ రహదారి వెళుతుండగా గర్రెపల్లి ప్రయాణ ప్రాంగణం, భూపతిపూర్ పంచాయతీ వ్యాపార సముదాయాలు కలిసే ఉంటాయి. గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, భూపతిపూర్ ప్రాథమిక పాఠశాల, గర్రెపల్లిలోని కేంద్ర ప్రభుత్వ ఆహార గిడ్డంగులు, భూపతిపూర్ ఎస్సీ కాలనీలు కలిసే ఉంటాయి. ఒక్క చోటనే రెండు గ్రామాలు కలిసి ఉండటం కొత్త వారికి వింత అనుభూతినిస్తోంది.

ఎలిగేడు మండలం శివపల్లి, నర్సాపూర్ గ్రామాలు ఆనుకొనే ఉంటాయి. కాట్నపల్లి నుంచి ఎలిగేడు మండలకేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా రెండూళ్లుంటాయి. సరిహద్దు ఎక్కువగా కలిగి ఉన్న శివపల్లి పంచాయతీ పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ చూసుకుంటుంది. ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే విజయరమణారావు భూమిపూజ చేసిన సమయంలో ఆ స్థలం తమదేనంటూ రెండు గ్రామాల ప్రజలు పేర్కొనడం కొంత గందరగోళానికి దారి తీసింది.

# పరిహారం అందేనా?



జగిత్యాల : అకాల వర్షాలతో పంటలను నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారాన్ని చెల్లించాల్సి ఉంటుంది. 2020 వానాకాలంలో అధిక వర్షాలతో రాష్ట్రంలో నష్టపోయిన రైతులకు 3 మాసాల్లోపు పెట్టుబడి రాయితీ (పంట నష్ట పరిహారం), 4 మాసాల్లోపు పంటల బీమా పరిహారాన్ని ఇవ్వాలని హైకోర్టు 2021 సెప్టెంబరు 28న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. నష్టపోయిన జాబితాలో జిల్లా రైతులు కూడా ఉండగా ఏ ఒక్క రైతుకూ పరిహారం అందలేదు. 2021 వానాకాలంలోనూ అధిక వర్షాలతో జిల్లాలో 30 వేల ఎకరాల్లో, 2021–2022 యాసంగిలో వడగళ్లతో 12 వేల ఎకరాల్లో పంటలను రైతులు కోల్పోయినా పరిహారం ఇవ్వలేదు.

**ఎన్నాళ్లీ దైన్యం** జిల్లాలో 2022 వానాకాలంలో 12,588 మంది రైతులకు చెందిన 22,993 ఎకరాల్లో ఆరుతడి పంటలు, 4,130 ఎకరాల్లో వరి దెబ్బతిన్నాయి. వర్షాలకు పొలాల్లోని లేత పైర్లు నీట మునిగిపోగా మళ్లీ విత్తాల్సి వచ్చింది.

నాటు వేసేందుకు దున్ని సిద్ధం చేసిన పొలాల్లోని మెత్తటి సారవంతమైన పైపొర (హ్యూమస్) వరదకు కొట్టుకుపోయి కేవలం ఇసుక, రాళ్లు మిగలటంతో వేలాది ఎకరాల్లో భూములు ఎందుకూ పనికిరాకుండా పోయాయి.

సాగు చేసిన తోటలు, పొలాలకుగాను ఎకరాకు కనీసం రూ.15 వేల చొప్పున జిల్లా రైతులు రూ.40 కోట్లకుపైగా నష్టపోయారు. దెబ్బతిన్న పొలాలు, తోట భూములకు మరమ్మతులు చేసి మళ్లీ పంటలు సాగు చేసేందుకు రూ.60 కోట్లకుపైగా వెచ్చించినా పరిహారం చెల్లించలేదు. 2023 మార్చి, ఏప్రిల్ మాసాల్లో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మార్చిలో జిల్లాలో 6,199 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా 532 ఎకరాలకు మాత్రమే పరిహారం చెల్లించారు. ఏప్రిల్‌లో 52 వేల ఎకరాల్లో మామిడి, వరి, మక్క, నువ్వు, జొన్న, కూరగాయలు తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినా ఒక్క రైతుకు పరిహారం చెల్లించలేదు. 2024 వానాకాలంలో జిల్లాలో భారీ వర్షాలతో 9 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతినగా ప్రస్తుత యాసంగిలో 5,522 ఎకరాల్లో పంటలు అకాల వర్షాలతో దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో పాత బకాయిలతో పాటు ఈ సీజన్ నష్టానికి ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారాన్ని చెల్లించాలని, వచ్చే వానాకాలం నుంచి అయినా పంటల బీమాను అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పొలాల్లో గండ్లు పడి గట్లుకూడా నామరూపాల్లేకుండా కొట్టుకుపోగా మడుల్లో ఇసుక మేటలు, బండలు పేరుకు పోయాయి. రైతులు ఎకరాకు కనీసం రూ.17 వేల నుంచి రూ.36 వేల వరకు పెట్టుబడిని కోల్పోగా మరమ్మతులకు ఎకరాకు రూ.20 వేల చొప్పున వెచ్చించారు.

జిల్లాలో 2023 వానాకాలంలో భారీ వర్షానికి 180 గ్రామాలకు చెందిన 14,065 మంది రైతులకు చెందిన 15,487 ఎకరాల్లో అన్నిరకాల పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. భారీ వర్షంతో లోతట్టు, ఎగువ ప్రాంతం, పొలాలు, తోటలనే తేడా లేకుండా అంతటా వరదనీరు ముంచెత్తి పైర్లను తీవ్రంగా నష్టపరిచింది.

# మీ సేవ.. ఇదేం సమస్య

భగత్‌నగర్ : మీ సేవ కేంద్రాల సేవలు సర్వర్ సమస్యతో ఆలస్యమవుతున్నాయి. క్షణాల్లో రావాల్సిన ప్రింటు.. పది నిమిషాల సమయం పడుతోంది. ఒక్కో దరఖాస్తు ఆలస్యం కావడంతో నిర్వాహకులతోపాటు లబ్ధిదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గత మూడు రోజులుగా ఇదే పరిస్థితి. గతేడాది సెప్టెంబరులో మీసేవలో సాంకేతిక సమస్య తలెత్తి ఇబ్బందులుపడ్డ లబ్ధిదారులు, నిర్వాహకులు ప్రస్తుతం సర్వర్ మొరాయింపుతో సతమతమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ ప్రకటణ జారీ చేసిన నాటి నుంచి ఈ సమస్య తలెత్తుతోందని నిర్వాహకులు తెలిపారు. రాజీవ్ యువ వికాసానికి ఈనెల 14వ తేదీ తుది గడువు కాగా భారీ సంఖ్యలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఔత్సాహికులు మీ సేవ కేంద్రాలను ఆశ్రయించడంతో సర్వర్‌పై భారం పెరిగింది.




గత నెల రోజులుగా సమస్య ఉన్నా.. మూడు రోజులుగా మరింత ఎక్కువ అయింది. శని, ఆది, సోమవారం మూడు రోజులు వరుస సెలవులు కావడంతో నిర్వాహకులకు లబ్ధిదారులకు ఇబ్బంది కలుగుతోంది. మీ సేవలో రెవెన్యూ, మున్సిపల్, పోలీసు, రిజిస్ట్రేషన్, రవాణా వంటి 36 శాఖలకు సంబంధించిన 350 సేవలు లభిస్తున్నాయి. జనన, ఆదాయ, కుల, నివాస, ధ్రువపత్రాలు కావాల్సిన వారు గతేడాది సాంకేతిక సమస్య తలెత్తి ఇబ్బందిపడ్డారు. ప్రస్తుతం ఇదే సమస్య పునరావృతమవుతోంది. నెల రోజులుగా ఇబ్బంది ఉన్నా.. గత మూడు రోజులుగా సమస్య మరింత తీవ్రమైందని నిర్వాహకులు తెలిపారు.

# ఇంతింతై.. 'స్వశక్తి'మంతమై

కరీంనగర్ : అక్షరం రాకున్నా.. ఉన్నత చదువులు లేకున్నా బతుకు బాటలో విజయ బావుటా ఎగురవేస్తున్నారు. నైపుణ్య శిక్షణ లేకున్నా స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. పల్లె, పట్టణం.. అనే తేడా లేకుంటా పొదుపు మంత్రాన్ని పఠిస్తూ భిన్న రంగాల్లో ఆరి తేరుతున్నారు. సోమవారం మహిళా పొదుపు దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో స్వశక్తి సంఘాల విజయ ప్రస్థానంపై ప్రత్యేక కథనం.



**సేవా స్ఫూర్తి.. సహకార దీప్తి**

సైదాపూర్ మండలం దుద్దెనపల్లి గ్రామ సమైక్య సంఘం 'పిడికెడు బియ్యం' పేరిట ఊరిలోని సంఘాల సభ్యులు ప్రతి నెలా ఇంటింటికీ తిరిగి బియ్యం సేకరిస్తారు. అలా సమకూరిన బియ్యాన్ని నిరుపేదలకిస్తూ ఆకలి తీరుస్తున్నారు. వీరిని చూసి ఉమ్మడి జిల్లాలో 25కి పైగా గ్రామాల్లో మహిళలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. అతివలు ఆధునికతను అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదిగేలా ఇటీవల పలు సంస్థలు బ్యాంకుమిత్ర, పశుమిత్ర, డ్రోన్ మిత్రలుగా అవకాశం కల్పిస్తున్నాయి. నాలుగు జిల్లాల్లో 654 చోట్ల మహిళలు ఇంట్లోనే ఉంటూ కామన్ సర్వీస్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలతో చిన్నతరహా పరిశ్రమలు, కుట్టు శిక్షణ కేంద్రాలు, చేనేత ఉత్పత్తుల స్టాళ్లు, హోటళ్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ఆసక్తి చూపుతున్నారు. హుజూరాబాద్ మండలం సిర్సపల్లిలో 42 మంది మహిళలు స్వకృషి పేరిట డెయిరీని ఏర్పాటు చేసుకుని పాల సేకరణ, విక్రయాలతో లాభాలు గడిస్తున్నారు.

# ఆధునిక వసతులతో చింత లేదిక

పెద్దపల్లి : ప్రభుత్వ వైద్యమంటేనే బెదిరిపోయే రోజు నుంచి.. సర్కారు ఆసుపత్రులకు వరుస కట్టే పరిస్థితులు వచ్చాయి. ఈ క్రమంలో పెద్దపల్లి ప్రభుత్వ వైద్యశాలలో వసతులు మెరుగయ్యాయి. పదేళ్ల క్రితం వరకు ఇక్కడి ఆస్పత్రిలో రోగుల సంఖ్య అంతంత మాత్రంగానే ఉండేది. ప్రస్తుతం ఇందులో మెరుగైన వసతులు, విస్తరించిన సేవలతో జిల్లా ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య అధికమైంది. రోగుల తాకిడికి తగిన విధంగా ఆధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. గత రెండు నెలల వ్యవధిలో పెద్దపల్లి జిల్లా ఆస్పత్రి దశ మారింది.

**అదనంగా 5 ఓపీ కౌంటర్లు**

ఆస్పత్రిలో అవుట్ పేషెంట్(ఓపీ) సేవలకు నిత్యం 900 నుంచి వెయ్యి మంది రోగులు వస్తున్నారు. గతంలో ఓపీ సంఖ్య వంద దాటితేనే గరిష్ఠంగా ఉండేది. ప్రస్తుతం ఆస్పత్రి ఆవరణలో ప్రత్యేక షెడ్డు వేయించి 5 ఓపీ కౌంటర్లను ఏర్పాటుచేశారు. ఇవే కాకుండా ఆస్పత్రిలో నెలకు 40 వరకు సాధారణ శస్త్ర చికిత్సలు, 50 వరకు ఆర్థోపెడిక్ ఆపరేషన్లు, 250 దంత, వంద వరకు కంటి చికిత్సలు జరుగుతున్నాయి.

మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో నెలకు 200 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. చిన్న పిల్లలకు నిర్వహించే టిఫా స్కానింగ్‌లు 150, అల్ట్రా స్కానింగ్‌లు 1500 వరకు నిర్వహిస్తున్నారు. గుండెకు సంబంధించి 200 వరకు 2డీఎకో పరీక్షలు సైతం చేపడుతున్నారు. రూ.55 లక్షలతో పడకల ఏర్పాటు ఆస్పత్రిలో బెడ్‌షీట్లు, దుస్తులు ఉతికేందుకు రూ.12 లక్షలతో మెకనైజ్డ్ లాండ్రీని ఏర్పాటు చేశారు. జిల్లా ఆస్పత్రి నూతన భవన నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో.. తాత్కాలికంగా రోగుల కోసం 40 పడకల సామర్థ్యం కలిగిన వార్డును రూ.55 లక్షలతో నిర్మించారు. ఇందులో ఎనిమిది ఏసీలను ఏర్పాటు చేశారు. రూ.45 లక్షలతో నవజాత శిశువుకు వెంటిలేటర్, రెండు బబుల్ షీటాప్, పది వార్మర్స్, రెండో ఫొటో థెరఫీ యంత్రాలు, పోర్టబుల్ ఎక్స్‌రేలు ఏర్పాటు చేశారు. రూ.10 లక్షలతో ల్యాపరోస్కోపి పరికరాలను అందుబాటులో ఉంచారు. ఆస్పత్రిలో 50 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. ప్రజల సహకారంతో.. పెద్దపల్లి జిల్లా ఆస్పత్రి అభివృద్ధి.. ప్రజల సహకారంతోనే సాధ్యమైంది. రోగుల అవసరాలను గుర్తించి, అందుకనుగుణంగా యంత్రాలను కొనుగోలు చేశాం. వైద్యులను నియమించి సేవలు అందించడంతోనే ఆస్పత్రిపై ప్రజలకు నమ్మకం పెరిగింది. శ్రీధర్, జిల్లా ఆస్పత్రి సమన్వయకర్త




అమరావతి: ఏపీ మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న బాలాజీ గోవిందప్పను సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో మైసూరులో ఆయన్ను అరెస్ట్ చేసి విజయవాడకు తీసుకొస్తున్నారు. గోవిందప్ప భారతీ సిమెంట్స్ పూర్తికాలపు డైరెక్టర్‌గా ఉన్నారు. మద్యం కుంభకోణం కేసులో విచారణకు హాజరుకావాలంటూ గోవిందప్పతో పాటు సీఎంవో మాజీ కార్యదర్శి ధనుంజయరెడ్డి, మాజీ సీఎం జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డికి మూడురోజుల క్రితం సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈ ముగ్గురినీ విజయవాడ కమిషనరేట్‌లోని సిట్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు విచారణకు హాజరు కావాలని ఆదేశించారు.

ఈ ముగ్గురూ నోటీసులను బేఖాతరు చేస్తూ విచారణకు గైర్హాజరయ్యారు. ఇప్పటికే వీరి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. సుప్రీంకోర్టు సైతం అరెస్టు నుంచి వీరికి మధ్యంతర రక్షణ ఇవ్వడానికి నిరాకరించింది. జగన్‌కు బాలాజీ గోవిందప్ప, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి అత్యంత సన్నిహితులు. 'మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల నుంచి ముడుపులు వసూలు చేయడం, ఆ సొమ్మును డొల్ల కంపెనీలకు మళ్లించడంలో కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పలతో పాటు ధనుంజయరెడ్డి పాత్ర ఉంది.

ముడుపులుగా ఎంత మొత్తం చెల్లించాలనేదానిపై ఈ ముగ్గురూ తరచూ హైదరాబాద్, తాడేపల్లిలో మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల యజమానులతో సమావేశమయ్యేవారు' అని సిట్ ఇప్పటికే తేల్చింది. మద్యం ముడుపుల సొమ్మును రాజ్ కెసిరెడ్డి వీరికి చేరవేస్తే.. వీరు దాన్ని జగన్‌కు అందజేసేవారని ఇప్పటివరకూ అరెస్టైన నిందితులకు సంబంధించిన రిమాండ్ రిపోర్టుల్లో ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో మైసూరులో బాలాజీ గోవిందప్పను సిట్ అరెస్ట్ చేసింది.




శిరిడీలో కొలువుదీరిన సాయినాథుడిని దర్శించుకునేందుకు దేశ విదేశాల నుంచి పెద్దఎత్తున భక్తులు విచ్చేస్తుంటారు. అలా వచ్చిన వేలాది మందికి ఉచితంగా, తక్కువ ఖర్చుతో కూడిన భోజనం అందిస్తోంది అక్కడి శిరిడీ సాయి ప్రసాదాలయం.

సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2009లో స్థాపించిన ఈ ప్రసాదాలయం.. అతిపెద్ద సోలార్ శక్తితో నడిచే ఆహార వంటశాలగా గుర్తింపు పొందింది. 11,550 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ప్రసాదాలయంలో ఒకేసారి 5,500 మంది భక్తులు కూర్చొని భోజనం చేయొచ్చు. రోజూ భోజనంలో అన్నం, పప్పు, రెండు రకాల కూరలు, రొట్టెలు, పెరుగు వడ్డిస్తారు.

సాధారణ రోజుల్లో 50 వేల మంది, ప్రత్యేక రోజుల్లో 75 వేల నుంచి లక్ష మందికి సాయిబాబా ప్రసాదం అందుతుంది.

## తిరుమలలో రేపటి నుంచి వీఐపీ సిఫారసు లేఖలు స్వీకరిస్తాం: మంత్రి ఆనం




తిరుమల: తిరుమలలో ఎల్లుండి (గురువారం) నుంచి వీఐపీ సిఫారసు లేఖలు స్వీకరిస్తామని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. తెలుగురాష్ట్రాల ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై ఎల్లుండి నుంచి బ్రేక్ దర్శనాలు ఉంటాయని చెప్పారు. మే 1 నుంచి జులై 15 వరకు సిఫారసు లేఖల బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు గతంలో తితిదే ప్రకటించింది. ప్రజాప్రతినిధులు, తితిదే బోర్డు సభ్యుల సిఫార్సు లేఖలు చెల్లవని వెల్లడించింది. ప్రోటోకాల్ వీఐపీలకు మాత్రమే బ్రేక్ దర్శనాలు ఉంటాయని చెప్పింది. వేసవి సెలవుల దృష్ట్యా తితిదే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఆ గడువును తగ్గించి మే 15 నుంచి ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు స్వీకరిస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.




ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం పంజాబ్‌లోని ఆదంపూర్ ఎయిర్‌బేస్‌ను సందర్శించారు. అక్కడ ఉన్న సైనికులతో మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్, భారత్-పాక్ కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా మన భద్రతా బలగాలు ఉగ్రస్థావరాలపై ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించాయి. అది జీర్ణించుకోలేని పాకిస్థాన్ మే 9, 10వ తేదీల్లో దాడులకు యత్నించింది. అయితే వాటిని మన సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టింది. దాయాది టార్గెట్ చేయాలని యత్నించిన వాటిలో ఆదంపూర్ వైమానిక స్థావరం కూడా ఒకటి. "ఈ ఉదయం నేను ఆదంపూర్ ఎయిర్‌బేస్‌కు వెళ్లాను. అక్కడ మన పోరాటయోధులను కలిశాను. ధైర్యం, దృఢ సంకల్పానికి ప్రతిరూపంగా నిలిచేవారితో మాట్లాడటం ఒక ప్రత్యేక అనుభవం. మన దేశ రక్షణ కోసం బలగాలు చేసే ప్రతిచర్యకు ప్రజలందరూ ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటారు" అని ఎక్స్ వేదికగా మోదీ రాసుకొచ్చారు. అలాగే వారితో దిగిన చిత్రాలను షేర్ చేశారు. అక్కడికి వెళ్లి పాక్ చేసిన తప్పుడు సమాచారాన్ని తిప్పికొట్టారు. వాయుసేన సిబ్బందితో ముచ్చటించి భుజం తట్టారు. ఆపరేషన్ వివరాలను మోదీకి బలగాలు వివరించాయి. గంటన్నరకు పైగా ఆయన అక్కడే గడిపారు. ఆ సమయంలో ఆయన ధరించిన టోపీపై త్రిశూల్ చిత్రం కనిపించింది. ఆపరేషన్ సిందూర్ గురించి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన మరుసటిరోజు మోదీ ఈ పర్యటన చేపట్టారు. నిన్న ప్రధాని మాట్లాడుతూ.. భారత్ ప్రళయభీకర దాడులను తట్టుకోలేకే పాకిస్థాన్ చివరకు కాల్పుల విరమణ పేరుతో కాళ్లబేరానికి వచ్చిందని వెల్లడించిన సంగతి తెలిసిందే. నవయుగ యుద్ధంలో పాకిస్థాన్‌ను భారత్ మట్టి కరిపించిందని, వారు సరిహద్దుల్లో యుద్ధానికి దిగితే మనం వాళ్ల గుండె పైనే కొట్టగలిగామన్నారు. ఆ దేశ ప్రవర్తనను పరిశీలిస్తామని, ముమ్మందు ఏమాత్రం తేడా వచ్చినా ఊరుకోబోమని హెచ్చరించారు. పహల్గాంలో ఉగ్రవాదులు వికృత క్రూరత్వాన్ని ప్రదర్శించి.. కుటుంబసభ్యుల ముందే అమాయక ప్రజలను చంపినందుకు ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని ఉగ్రసౌధాలను కుప్పకూల్చి 100 మందికి పైగా పేరుమోసిన ఉగ్రవాదులను అంతమొందించినట్లు ప్రకటించారు. ఆ దేశంతో చర్చలంటూ జరిగితే ఉగ్రవాద నిర్మూలన, పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై మాత్రమేనని స్పష్టంచేశారు. భారతదేశాన్ని, ప్రజలను రక్షించుకోవడానికి ఎంతపెద్ద నిర్ణయం తీసుకోడానికైనా వెనుకాడబోమని పాక్‌కు తేల్చిచెప్పారు.

**పాక్ తప్పుడు ప్రచారానికి మోదీ చెక్..** ప్రధాని మోదీ షేర్ చేసిన చిత్రాల్లో చెక్కు చెదరకుండా ఉన్న ఎస్-400 రక్షణ వ్యవస్థ కనిపించింది. ఆదంపూర్‌లోని ఎస్-400 స్థావరాన్ని ధ్వంసం చేశామని పాక్ ప్రచారం చేసింది. భారత్‌లోని కీలకమైన మౌలిక సదుపాయాలు, విద్యుత్తు.. సైబర్ వ్యవస్థలపై దాడి చేసి ధ్వంసం చేశామని చెప్పింది. ఇదంతా హేయమైన దుష్ప్రచారం అని భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తప్పుబట్టిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ ఎయిర్‌బేస్‌కు వెళ్లి మోదీ దాయాది తప్పుడు ప్రచారానికి చెక్ పెట్టారు. అలాగే భద్రతాబలగాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఈ పర్యటన ద్వారా గట్టి సందేశం ఇచ్చారు.

## ఏపీ భవన్‌లో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ.. సీఎం చంద్రబాబు సూచనతో నిలిపివేత



అమరావతి: దిల్లీలోని ఏపీ భవన్ ప్రాంగణంలో ఆక్రమణల తొలగింపు అంశంపై అధికారులతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. 0.37 ఎకరాల్లో ఆక్రమణలను అధికారులు గుర్తించారు. రెండు ప్రార్థనా మందిరాలు ఉన్నాయని.. వాటిని తొలగించాల్సి ఉందని సీఎం దృష్టికి వారు తీసుకెళ్లారు. ప్రార్థనా మందిరాల తొలగింపుపై సంయమనం పాటించాలని.. ప్రజల మనోభావాలు దెబ్బతినే చర్యలు తీసుకోవద్దని అధికారులకు చంద్రబాబు సూచించారు. సీఎం సూచనతో ఆక్రమణల తొలగింపు ప్రక్రియను అధికారులు నిలిపివేశారు.

## ఏపీ మద్యం కుంభకోణం కేసు.. వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డికి సుప్రీంలో చుక్కెదురు



దిల్లీ: ఏపీ మద్యం కుంభకోణం కేసులో వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ముందస్తు బెయిల్ కోసం హైకోర్టునే ఆశ్రయించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్‌ను నిరాకరిస్తూ గతంలో హైకోర్టు తీర్పు ఇచ్చింది. పిటిషన్ దాఖలు చేసే సమయానికి ఆయనను నిందితుడిగా అధికారులు చేర్చలేదు. అరెస్టు చేసే ఉద్దేశం లేదని.. అప్పుడు ప్రభుత్వం చెప్పడంతో హైకోర్టు పిటిషన్‌ను కొట్టివేసింది.

ప్రస్తుతం మిథున్‌రెడ్డిని నిందితుడిగా చేర్చిన విషయాన్ని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. దీంతో మెరిట్స్ ఆధారంగా మళ్లీ విచారణ చేపట్టాలని హైకోర్టుకు జస్టిస్ పార్థివాలా ధర్మాసనం సూచించింది. గతంలో మిథున్‌రెడ్డికి ఇచ్చిన మధ్యంతర రక్షణను కూడా సుప్రీంకోర్టు తొలగించింది. ఆయన బెయిల్ అంశంలో నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని హైకోర్టుకు సూచించింది.

## జగన్ ప్రభుత్వంలో ఇరిగేషన్ రంగాన్ని అధ్వానంగా మార్చారు




అమరావతి: వందల, వేల కోట్లు పెట్టి ప్రాజెక్టులు నిర్మిస్తే వైసీపీ ప్రభుత్వం సరైన మెయింటెనెన్స్ కూడా చేయకుండా గాలికి వదిలేసిందని మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. ఇవాళ(మంగళవారం) ఏపీ సచివాలయంలో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మీడియాతో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడారు. ఇరిగేషన్ పనుల నిర్వహణ, మరమ్మతుల కోసం సీఎం చంద్రబాబు రూ.344 కోట్లు నిధులు మంజూరు చేశారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. తూడు, గుర్రపుడెక్క, పూడికతీత వంటి అత్యవసర పనుల కోసం రూ.10లక్షలు దాటితే, కాలయాపన చేయకుండా, 7 రోజుల్లోనే పనులు పూర్తయ్యేలా, షార్ట్ టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. రూ.10లక్షల్లోపు ఉన్న పనులను, సాగు నీటి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టాలని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కనీసం కాలువల్లో తట్ట మట్టి కూడా తీయకపోగా, షట్టర్లు, డోర్లు, గేట్లకు మరమ్మతులు చేయకపోగా, గ్రీజు కూడా పెట్టలేదని మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత జగన్ ప్రభుత్వం తప్పిదాలను తమ ప్రభుత్వం సరిచేసుకుంటూ, ఇరిగేషన్ రంగాన్ని గాడిలో పెడుతున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జూన్‌లో రూ.90 కోట్లతోనూ, సెప్టెంబర్‌లో అత్యవసర పనులకు గానూ రూ.326 కోట్లతో నిర్వహణ పనులు చేశామని అన్నారు. ఇరిగేషన్ అధికారులు కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు స్వీయ పర్యవేక్షణ చేస్తూ, మే చివరి నాటికి పనులు పూర్తి చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు.




వినుకొండ: పల్నాడు జిల్లాలో మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వినుకొండ మండలం శివాపురం వద్ద బొప్పాయి కాయల లోడ్‌తో వెళ్తున్న బొలెరో ట్రాలీని లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనాస్థలిలో ముగ్గురు మృతి చెందగా.. ఆస్పత్రికి తరలిస్తుండగా మరొకరు చనిపోయారు. మృతులంతా ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం గడ్డమీదపల్లికి చెందిన వ్యవసాయ కూలీలు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించారు. ఈ రోడ్డు ప్రమాదంపై మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

## పెద్దారెడ్డి వర్సెస్.. ప్రభాకర్ రెడ్డి.. వణికిపోతున్న తాడిపత్రి..




తాడిపత్రి, మే 13: ఇద్దరి పంతం తాడిపత్రి ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. తాడిపత్రిలో అడుగుపెట్టాలని వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే పెద్దా రెడ్డి ప్రయత్నిస్తుండగా, ఎట్టి పరిస్థితుల్లోనైనా అడ్డుకుని తీరాలని మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పంతం పట్టారు. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల తర్వాత హింస చెలరేగి ఒక యుద్ధ వాతావరణాన్ని తలపించింది. ఈక్రమంలో పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తే రెండు వర్గాలు మరోసారి తలపడతాయేమోననే ఆందోళన పట్టణ ప్రజల్లో నెలకొంది. ఈ వారంలోనే మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి హైకోర్టు అనుమతితో తాడిపత్రికి వస్తున్నారని సమాచారం. ఉరవకొండలో సీఎం ప్రోగ్రాం, వీరజవాన్ మరణంతో పోలీసులు ఆ పనుల్లో నిమగ్నమై ఉండటంతో భద్రతా కారణాల రీత్య ఆయన రాక కొంత ఆలస్యమైనట్లు సమాచారం. అయితే పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తే అడ్డుకుంటామని ఇప్పటికే జేసీ ప్రభాకర్‌రెడ్డి సంకేతాలు పంపించిన విషయం అందరికి తెలిసిందే. వాటిని దృష్టిలో ఉంచుకొని జిల్లా పోలీసు యంత్రాంగం ఇప్పటికే దాదాపు 200 మంది పోలీసులను తాడిపత్రిలో దింపింది. ఈక్రమంలో చోటా మోటా నాయకుల్లో అలజడి ఏర్పడింది. పెద్దారెడ్డి రాకతో ఏమైనా గొడవలు జరిగితే ఎక్కడ తాము ఇరుక్కోవాల్సి వస్తుందోననే ఆందోళన వారిని వెంటాడుతోంది. దీంతో కుటుంబాలకు దూరమవడమే కాకుండా ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తుందనే భయం వారిలో నెలకొంది. ఇప్పటికీ ప్రభోదానంద కేసులు, ఎలక్షన్ కేసులతో ఇబ్బంది పడుతుంటే మళ్లీ ఎక్కడ కొత్త కేసులు వచ్చి నెత్తిన పడతాయోననే ఆందోళన వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. పోలీసులు కూడా ఇప్పటికే పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని పలువురు నాయకులు, కార్యకర్తలకు పరోక్షంగా హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం.

**కేసుల భయం..** ఇప్పటికే పోలీసు అధికారులు నాయకులకు హెచ్చరికతో కూడిన సూచనలు చేనట్లు సమాచారం. పదిరోజుల కిందట తాడిపత్రి కళాశాల గ్రౌండ్లో రాళ్లు తోలారని ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు వాటిని దృష్టిలో పెట్టుకొని నాయకులు, రౌడీషీటర్లకు హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. అల్లర్లు సృష్టించి ఘర్షణల్లో పాల్గొన్నట్లయితే కేసులు నమోదుచేసి రౌడీషీట్ ఓపెన్ చేసి జిల్లా నుంచి బహిష్కరిస్తామని, అవసరమైతే పీడీయాక్ట్ వంటి కేసులు నమోదు చేస్తామని తీవ్రంగా హెచ్చరించినట్లు తెలిసింది.

ఈక్రమంలోనే నాయకుల్లో కేసుల గుబులు రేగుతోంది. గతంలో ప్రభోదానంద కేసులు, 2024 ఎన్నికల కేసులు ఇరుక్కొని కొంతకాలం అండర్ గ్రౌండ్‌కు వెళ్లిన సంఘటనలు గుర్తుకు తెచ్చుకుని కొందరు ఆందోళన చెందుతున్నట్లు సమాచారం.

## మన సైన్యానికి దైవబలం మెండుగా ఉండాలి.. ఆలయాల్లో జనసేన ప్రత్యేక పూజలు

అమరావతి: జనసేన నేతలు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 'ఆపరేషన్ సిందూర్'తో పాకిస్థాన్‌కు గట్టి గుణపాఠం చెప్పిన మన దేశ సైన్యానికి, నాయకత్వానికి దైవబలం మెండుగా ఉండాలని కోరుతూ షష్ఠ షణ్ముఖ క్షేత్రాలు, ఇతర ఆలయాల్లో పూజలు చేయాలని ఆ పార్టీ నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా మంగళవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీకనకదుర్గమ్మకు మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ హరిప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటకలోని ఘాటీ సుబ్రహ్మణ్య క్షేత్రంలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో నేతలు అర్చన, అభిషేకాలు, కళ్యాణోత్సవం నిర్వహించారు. దేశ సైన్యానికి దైవబలం మెండుగా ఉండాలని ప్రార్థించారు.



# దేవియాని గ్లామర్ ట్రీట్


ఇన్‌స్టాగ్రామ్‌లో సోషల్ మీడియా యాక్టివిటీతో ఎప్పుడూ ఫోకస్‌లో ఉండే నార్త్ బ్యూటీ దేవియాని శర్మ తాజాగా షేర్ చేసిన గ్లామర్ ఫొటోలు ఇప్పుడు తెగ వైరల్ అవుతున్నాయి. ఆమె ఫాలోవర్లకు అందించిన ఈ లుక్‌కు నెటిజన్లు ఫిదా అయిపోయారు. ఎర్ర రంగు బ్లౌజ్, ఆకుపచ్చ చీరతో సంప్రదాయ దుస్తుల్లో కనిపించిన దేవియాని తన గ్లామర్ లుక్‌తో ఫోటోషూట్‌కి కొత్త డెఫినిషన్ ఇచ్చింది. ఎక్స్‌ప్రెషన్స్, ఆ అటిట్యూడ్%ౌ% చూస్తుంటే అందరి ఫోకస్ ఆమెపై యూ టర్న్ తీసుకోకుండా ఉండదు. ఫొటోలు చూసిన నెటిజన్లు 'ఫైర్' కామెంట్లతో ఫుల్ ట్రెండ్‌లోకి తీసుకొస్తున్నారు. దేవియాని శర్మ మొదటగా యూట్యూబ్ వెబ్ సిరీస్‌లతో వెలుగులోకి వచ్చారు. 'సేవ్ ది టైగర్స్', 'షైతాన్', వంటి వెబ్ కంటెంట్ ప్రాజెక్టుల్లో ఆమె నటనకు మంచి గుర్తింపు వచ్చింది. ముఖ్యంగా సైతాన్ సిరీస్‌లో ఆమె పోషించిన



ఇంటెన్స్ క్యారెక్టర్‌కు సంబంధించిన లుక్స్, యాక్షన్ సీన్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దేవియాని ఏ పాత్రలోనైనా ఒదిగిపోయే నైపుణ్యం ఉండటంతో ఆమెకు వరుసగా అవకాశాలు వచ్చాయి. వెబ్ సిరీస్‌లతో పాటు సినిమాలపై కూడా ఫోకస్ పెడుతున్న దేవియాని త్వరలో టాలీవుడ్‌లో ఒక మంచి పాత్రతో రాబోతున్నట్లు సమాచారం. తెలుగులో ఆమెకు పూర్తి స్థాయి గ్లామర్ రోల్స్‌తో పాటు పెర్ఫార్మెన్స్‌ను హైలైట్ చేసే పాత్రలపై ఆసక్తి ఉంది. ఈ మధ్య వచ్చిన ఓ ఫోటోషూట్‌లో కూడా ఆమె స్టన్నింగ్‌గా కనిపించడం చూస్తే, స్టార్ ఇమేజ్ కోసం ఎలా ప్లాన్ చేసుకుంటున్నదో అర్థమవుతోంది. ఇటీవల ఆమె పుట్టినరోజు సందర్భంగా చాలా సెలబ్రిటీలు, ఫ్యాన్స్ సోషల్ మీడియాలో విషెస్ చెబుతుండగా, ఆమె పోస్ట్ చేసిన స్టైలిష్ లుక్స్‌కి హృదయాలే పెట్టేశారు. దేవియాని సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉండే బ్యూటీ. ఇన్‌స్టా రీల్స్, ట్రెండింగ్ ఫోటోషూట్లతో ఫాలోయింగ్ పెంచుకుంటూ కెరీర్ పరంగానూ ముందుకు సాగుతోంది.

# డిమాండ్ వల్లే అమ్మడికి అవకాశాలు లేవా..?

సీతారామం సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన బాలీవుడ్ భామ మృణాల్ ఠాకూర్ ఆ సినిమా సక్సెస్ అవ్వడమే కాదు ఆమెకు కెరీర్ లో ఒక మంచి జోష్ ఇచ్చింది. ఆ సినిమా తర్వాత హిందీలో కూడా మృణాల్ కి వరుస ఆఫర్లు వస్తున్నాయి. ఇక తెలుగులో కూడా సీతారామం సీతామహాలక్ష్మి గా ప్రేక్షకుల మనసులు గెలుచుకుంది. ఆఫ్టర్ సీతారామం నానితో హాయ్ నాన్న సినిమా చేసి అది కూడా హిట్ సాధించింది మృణాల్. నానితో మృణాల్ చేసిన హాయ్ నాన్న ఎమోషనల్ ఎంటర్టైనర్ గా వచ్చింది. సినిమాలో మ్యూజిక్ కూడా ప్రేక్షకులకు బాగా ఎక్కేసింది. వచ్చీరాగానే రెండు హిట్ సినిమాలు చేసిన మృణాల్ ని తెలుగు ఆడియన్స్ స్టార్ క్రేజ్ ఇచ్చేస్తారు అనుకున్నారు. ఐతే థర్డ్ అటెంప్ట్ గా అమ్మడు విజయ్ దేవరకొండతో ది ఫ్యామిలీ స్టార్ సినిమా చేసింది. ఆ సినిమాలో తన పోర్షన్ వరకు మెప్పించినా ఓవరాల్ గా సినిమా వర్క్ అవుట్ అవ్వకపోవడంతో ఫ్లాప్ అయ్యింది. రెండు హిట్లు పడ్డాక పాపులర్ అయిన మృణాల్ మొదటి ఫ్లాప్ కి షాక్ అయ్యింది. అయితే ఆ తర్వాత ఛాన్స్ లు కూడా రావట్లేదు. మరోపక్క హిందీలో ఇప్పుడు వరుస సినిమాలతో



బిజీ అవుతుంది మృణాల్ ఠాకూర్. ఒకేసారి తెలుగు ఆఫర్, హిందీ ఆఫర్ వస్తే హిందీనే పిక్ చేసుకుంటుందట మృణాల్ ఠాకూర్. అంతేకాదు తెలుగులో రెమ్యునరేషన్ ఇంకా ఎక్కువ కావాలని డిమాండ్ చేస్తుందని కూడా చెబుతున్నారు. ఐతే బాలీవుడ్ లో మృణాల్ ఆల్రెడీ క్రేజ్ కొనసాగిస్తుంది కాబట్టి అక్కడ భారీగానే పారితోషికం అందుకుంటుందని తెలుస్తుంది. మరి నిజంగానే మృణాల్ టాలీవుడ్ సినిమాలను రెమ్యునరేషన్ కోసమే కాదంటుందా అనేది క్లారిటీ రావాల్సి ఉంది. ఓ పక్క తన గ్లామర్ తో ఫోటో షూట్స్ చేస్తూ ఫాలోవర్స్ కి పిచ్చెక్కేలా చేస్తున్న మృణాల్ తెర మీద చేసే పాత్రల్లో తన అభినయంతో ఆకట్టుకుంటుంది. మృణాల్ తో కంప్లీట్ గా ఒక రొమాంటిక్ రోల్ చేయిస్తే బెటర్ అని ఆడియన్స్ కోరుతున్నారు. మరి అలాంటి సినిమా ఎవరితో పడుతుంది అన్నది చూడాలి. మృణాల్ ఠాకూర్ మాత్రం తెలుగులో ఎలాంటి అవకాశం వచ్చినా తాను ఎప్పుడూ రెడీ అనేస్తుంది. ఒకటి రెండు సినిమాలు డిస్కషన్ స్టేజ్ లో ఉన్నాయని తెలుస్తుంది. అవి ఏంటన్నది త్వరలో తెలుస్తుంది.




# ఎన్టీఆర్ నీల్ మూవీలో బాలీవుడ్ భామ?




మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ గతేడాది దేవర సినిమాతో బాక్సాఫీస్ వద్ద చేసిన హంగామా అంతా ఇంతా కాదు. దేవరతో కలెక్షన్ల సునామీ సృష్టించిన ఎన్టీఆర్ ఆ సినిమాకు సీక్వెల్ కూడా చేయాల్సి ఉంది. కానీ దానికంటే ముందే ఎన్టీఆర్ మరో రెండు సినిమాలతో ఆడియన్స్ ను పలకరించనున్నాడు. అందులో ఒకటి వార్2 కాగా, రెండోది డ్రాగన్. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో హృతిక్ రోషన్ హీరోగా తెరకెక్కుతున్న సినిమా వార్2. భారీ అంచనాలతో వస్తోన్న ఈ సినిమా షూటింగ్ ను ఎన్టీఆర్ ఇప్పటికే పూర్తి చేశాడు. వార్2 సినిమాతోనే ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండటంతో వార్2 సినిమాపై ఎన్టీఆర్ ఫ్యాన్స్ తో పాటూ అందరికీ దానిపై మంచి ఆసక్తి నెలకొంది.

ఇక రెండోది ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ చేస్తున్న సినిమా. ఎన్టీఆర్‌నీల్ వర్కింగ్ టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్ తో రూపొందిస్తుంది. ఈ సినిమాకు డ్రాగన్ అనే టైటిల్ ను పరిశీలిస్తున్నట్టు సమాచారం. పాన్ ఇండియా లెవెల్ లో తెరకెక్కుతున్న ఈ సినిమా గురించి ప్రస్తుతం ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ వినిపిస్తోంది. డ్రాగన్ మూవీలో బాలీవుడ్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ ఓ కీలక పాత్రలో నటించనుందని టాలీవుడ్ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. సెకండాఫ్ లో వచ్చే ఆమె పాత్ర సినిమాకే హైలైట్ కానుందని సమాచారం. అయితే ఈ సినిమా కోసం ఆల్రెడీ కన్నడ భామ రుక్మిణి వసంత్ ను తీసుకున్నారని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. ఇప్పుడు సడెన్ గా శ్రద్ధా కపూర్ పేరు వినిపించడంతో ఏ వార్త నిజమని కొందరు అయోమయంలో పడితే, మరికొందరు ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉంటారని, అందులో ఒకరు రుక్మిణి వసంత్ కాగా, మరొకరు శ్రద్ధా కపూర్ అయుండొచ్చని జోస్యం చెప్తున్నారు. ఏదేమైనా ఈ విషయంలో మేకర్స్ నుంచి క్లారిటీ వచ్చే వరకు ఏదీ నమ్మడానికి లేదు.

# ఆ రూల్‌ని బ్రేక్ చేస్తున్న కూలీ, థగ్ లైఫ్?




సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కూలీ. లోకేష్ కనగరాజ్ అత్యంత భారీ స్థాయిలో ఈ మూవీని రూపొందిస్తున్నాడు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై భారీ చిత్రాల నిర్మాత కళానిధి మారన్ భారీ బడ్జెట్‌తో భారీ స్టార్ కాస్ట్‌తో నిర్మిస్తున్నారు. ఇందులోని కీలక పాత్రల్లో కింగ్ నాగార్జున, కన్నడ స్టార్ ఉపేంద్ర, శృతిహాసన్, రెబా మోనికా జాన్ నటిస్తున్నారు. కీలకమైన గెస్ట్ క్యారెక్టర్‌లో బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్ట్ అమీర్‌ఖాన్ కనిపించనున్నారు. బుట్టబొమ్మ పూజా హెగ్డే మాసీవ్ ఐటమ్ నంబర్‌తో మెస్మరైజ్ చేయబోతోంది. భారీ హంగులతో భారీ స్టార్ కాస్ట్‌తో రూపొందుతున్న ఈ మూవీని లోకేష్ కనగరాజ్ గోల్డ్ స్మగ్లింగ్ నేపథ్యంలో రూపొందిస్తున్నాడు. ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్న ఈ సినిమాని ఆగస్టు 14న భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. హిందీ బెల్ట్‌లో ఈ సారి భారీగా విడుదల చేయాలని భావిస్తున్నారు. ఇందు కోసం ప్లాన్‌ని కూడా రెడీ చేశారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన టాక్స్ నడుస్తున్నాయి. ఇక ఇదే తరహాలో మరో సీనియర్ హీరో కమల్ హాసన్ చాలా ఏళ్ల గ్యాప్ తరువాత మణిరత్నంతో కలిసి చేస్తున్న మూవీ థగ్ లైఫ్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. కమల్‌తో పాటు శింబు కీలక పాత్రలో నటించాడు. త్రిష, సాన్య మల్హోత్రా, పంకజ్ త్రిపాఠీ, జోజు జార్జ్ నటిస్తున్నారు. మణిరత్నం, కమల్‌హాసన్ కలిసి కథ అందించిన ఈ మూవీని కమల్, మణిరత్నంలతో కలిసి యంగ్ హీరో ఉదయనిధి స్టాలిన్ నిర్మిస్తున్నారు. సుధీర్ఘ విరామం తరువాత కమల్, మణిరత్నం కలిసి చేస్తున్న సినిమా కావడంతో థగ్ లైఫ్‌పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ మూవీని జూన్ 5న భారీగా పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. హిందీ బెల్ట్‌లోనూ ఈ మూవీని భారీ స్థాయిలో రిలీజ్ చేయబోతున్నారట. ఇందు కోసం రజనీ కూలీ, కమల్ థగ్ లైఫ్ రూల్‌ని బ్రేక్ చేయబోతున్నారని తెలుస్తోంది. తమిళ సినిమాలు 4 వారాల తరువాత ఓటీటీల్లోకి వచ్చేస్తున్న విషయం తెలిసిందే.

అయితే హిందీ బెల్ట్‌లో భారీ స్థాయిలో రిలీజ్ కావాలంటే 8 వారాల తరువాతే ఓటీటీల్లోకి రావాలని బాలీవుడ్ మేకర్స్ రూల్ పెట్టారట. ఈ రూల్‌కు ఈ రెండు సినిమాల మేకర్స్ సై అంటే హిందీ బెల్ట్‌లో మరీ ముఖ్యంగా పీవీఆర్, ఐనాక్స్ వంటి ప్రముఖ థియేటర్ చైన్స్‌లో భారీ స్థాయిలో కూలీ, థగ్ లైఫ్ రిలీజ్ అవ్వడం ఖాయం అని చెబుతున్నారు. ప్రస్తుతం ఈ రూల్‌కు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే ఓ కొలిక్కి వస్తాయని, అలా వస్తే ఈ రెండు సినిమాలు ఉత్తరాదిలో బారీ స్థాయిలో రిలీజ్ కావడం ఖాయమని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇదే నిజమైతే ఉత్తారాదిలో ఉన్న రజనీ, కమల్ అభిమానులకు పండగే.

# 'సింగిల్స్'తో హాట్ లేడీ ఇక ట్రాక్‌లోకి వచ్చేసినట్టేనా?

డబుస్మాష్ వీడియోలతో నెట్టింట పాపులర్ అయిన ఢిల్లీ భామ కేతికశర్మ. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మంచి క్రేజ్‌ని సొంతం చేసుకున్న కేతిక వెర్సటైల్ డైరెక్టర్ పూరి దృష్టిని ఆకర్షించి తొలి అవకాశాన్ని దక్కించుకుంది. పూరి తనయుడు ఆకాష్ పూరి హీరోగా నటించిన రొమాంటిక్ మూవీతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించింది. కానీ తొలి మూవీతో హాట్ బేబీగా గుర్తింపుని తెచ్చుకుందే కానీ హిట్‌ని మాత్రం దక్కించుకోలేకపోయింది. హాటీగా పూర్తి ఎఫర్ట్ పెట్టినా కథ, కథనాలు ఆకట్టుకోలేకపోవడంతో కేతికకు తొలి అడుగులోనే పరాభవం ఎదురైంది. ఆ తరువాత నాగశౌర్యతో చేసిన లక్ష్య, వైష్ణవ్ తేజ్‌తో చేసిన రంగ రంగ వైభవంగ%-% కూడా అదే కోలలో చేరి కేతికని తవ్రంగా నిరాశకు గురి చేసింది. పవర్‌స్టార్‌తో కలిసి సాయిధరమ్ తేజ్ చేసిన బ్రో కూడా కేతిక కెరీర్‌ని ట్రాక్‌లో పెట్టలేకపోయింది. అయితే ఇటీవల నితిన్ నటించిన రాబిన్ హుడ్‌లో




అదిదా సర్‌ప్రైజ్ అంటూ ఐటమ్ నంబర్‌లో హీటెక్కించింది. శేఖర్ మాస్టర్ వివాదాస్పద స్టెప్పులతో వార్తల్లో నిలిచింది. సినిమా హిట్ కాకపోయినా కేతికని మాత్రం వార్తల్లో నిలిపేలా చేసింది. అయితే కేతిక ఐటమ్ నంబర్లకే పరిమితమా? హీరోయిన్‌గా సక్సెస్‌ని దక్కించుకోలేదా? అనే కామెంట్‌లు వినిపించాయి. ఎంతగా ప్రయత్నించినా తనకు కమర్షియల్ విజయం లభించకపోవడంతో కేతిక కూడా కొంత నిరుత్సాహానికి గురైంది. అయితే తాజాగా శ్రీవిష్ణుతో కలిసి చేసిన సింగిల్ రీసెంట్‌గా విడుదలై మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. హీట్ సమ్మర్‌లో కూల్‌హిట్‌గా నిలిచి శ్రీవిష్ణుతో పాటు కేతికకు, లవ్ టుడే ఫేమ్ ఇవానకు మంచి విజయాన్ని అందించింది. చాలా రోజుల తరువాత కేతిక శర్మకు సింగిల్‌తో సక్సెస్ లభించింది. దీంతో హాట్ లేడీగా పేరు తెచ్చుకున్న కేతిక ఇక ట్రాక్‌లోకి వచ్చేసినట్టేనా? అనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. ఫస్ట్ డే ఫస్ట్ షో నుంచే పాజిటివ్ టాక్‌ని సొంతం చేసుకున్న సింగిల్ వసూళ్ల పరంగానూ మంచి ఫిగర్లని నమోదు చేస్తుండటంతో ఇక కేతిక కెరీర్ టర్న్ అయినట్టేనని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. ఈ మూవీ తరువాత కేతిక తమిళ డైరెక్టర్ రాజేష్ ఎం.సెల్వ డైరెక్షన్‌లో ఓ మూవీ చేస్తోంది. ఇది కూడా హిట్ అనిపించుకుంటే తెలుగులో కేతికకు ఇక తిరుగుండదన్నమాటే.

# రాజు గారికి కలిసి వచ్చేలా ఇవానా సక్సెస్ ..!

ఒక సినిమా సక్సెస్ అయితే ఆ సినిమాకు పనిచేసిన వారందరికీ మంచి జోష్ ఇస్తుంది. అంతేకాదు ఆ హిట్ వల్ల నెక్స్ట్ త్వరగా అవకాశాలు వస్తాయి. ఆల్రెడీ సెట్స్ మీద ఉన్న సినిమాలకు ఇంకాస్త బజ్ పెరుగుతుంది. ఐతే లేటెస్ట్ గా ఒక సినిమా హిట్ తో అగ్ర నిర్మాత దిల్ రాజుకి కూడా కలిసి వచ్చేలా ఉంది. ఇంతకీ అసలు ఇక్కడ మ్యాటర్ ఏంటంటే తమిళ్ లో సక్సెస్ అయిన లవ్ టుడే సినిమాను తెలుగులో డబ్ చేసి రిలీజ్ చేశాడు దిల్ రాజు. ఆ సినిమా యూత్ ఆడియన్స్ కి విపరీతంగా నచ్చేసింది. తెలుగులో కూడా సినిమా హిట్ అయ్యింది. ప్రదీప్ రంగనాథ్, ఇవానా జంటగా నటించిన లవ్ టుడే తెలుగులో కూడా సక్సెస్ అవ్వడంతో వెంటనే దిల్ రాజు ఇవానాని తన నెక్స్ట్ సినిమా లో తీసుకున్నారు. తన ఇంటి వారసుడు ఆశిష్ హీరోగా తెరకెక్కిస్తున్న సెల్ఫిష్ సినిమాలో ఇవానా హీరోయిన్ గా



నటించింది. విశాల్ కాశి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా డిఫరెంట్ కథతో రాబోతుందని తెలుస్తుంది. సినిమా నిర్మాణంలో సుకుమార్ రైటింగ్స్ కూడా భాగం అవుతున్నాడు. ఈ సినిమా ఎప్పుడో రిలీజ్ అవ్వాల్సి ఉన్నా ఆశిష్ తో లవ్ మీ అనే సినిమా తీసి దాన్ని ముందు రిలీజ్ చేశారు. ఐతే సెల్ఫిష్ అవుట్ పుట్ పై దిల్ రాజు అంత సాటిస్ఫైడ్ గా లేరని అందుకే సినిమా రిలీజ్ ఆపారని తెలుస్తుంది. ఐతే లేటెస్ట్ గా ఇవానా శ్రీవిష్ణుతో సింగిల్ సినిమా చేసింది. ఆ సినిమా సూపర్ హిట్ టాక్ తో దూసుకెళ్తుంది. లవ్ టుడే డబ్బింగ్ సినిమా తో ఇవానా తెలుగు సక్సెస్ అందుకోగా స్ట్రైట్ గా సింగిల్ తో కూడా హిట్ అందుకుంది. సో ఇవానా హిట్ మేనియా కచ్చితంగా సెల్ఫిష్ సినిమాకు కలిసి వస్తుందని చెప్పొచ్చు. అందుకే సెల్ఫిష్ సినిమాపై దిల్ రాజు ఫోకస్ చేస్తున్నారని తెలుస్తుంది. ఆశిష్ ఈమధ్యనే మరో సినిమా మొదలు పెట్టాడు. దిల్ రాజు, శిరీష్ లు ఎలాగైనా ఆశిష్ ని హీరోగా నిలబెట్టాలని గట్టి ప్రయత్నం చేస్తున్నారు. సెల్ఫిష్ నుంచి రిలీజైన సాంగ్ కూడా బాగానే క్లిక్ అయ్యింది.ఇవానా లక్ సెల్ఫిష్ టీం కు కలిసి వస్తుందా లేదా అన్నది చూడాలి.




'ధర్మ సంస్థాపన కోసం ఆయుధం పట్టడం మన సంప్రదాయం. మన సోదరిసోదరీమణుల నుదుటి సింధూరం తుడిచిన వారి నట్టింట్లోకి వెళ్లి నాశనం చేశాం' అని ఆపరేషన్ సిందూర్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. 'యుద్ధ క్షేత్రంలోనూ భారత్ నినాదాలు మార్మోగాయి. ఆకాశం నుంచి పాతాళం వరకు నినాదం మార్మోగింది. వీర సైనికులకు సెల్యూట్ చేస్తున్నా' అని ప్రధాని మోదీ ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్ నినాదం ప్రపంచమంతా మార్మోగుతోందని చెప్పారు.

భారత్ మాతాకీ జై నినాదం శత్రువుల చెవుల్లో గింగిరాలు తిరుగుతోందని.. అది శత్రువుల వెన్నులో వణుకు పుట్టించిందని పేర్కొన్నారు. పంజాబ్‌లోని ఆదంపూర్‌లోని ఎయిర్ బేస్‌ను ప్రధాని మోదీ మంగళవారం సందర్శించారు. అక్కడి సైనికులతో మాట్లాడి వారిని అభినందించి ప్రోత్సహించారు. అనంతరం సైనికులను ఉద్దేశించి ప్రధాని మోదీ కీలక ప్రసంగం చేశారు. 'భారత సైన్యం ఎదురుగా నిలిచి పోరాడింది. సైన్యం ఉగ్రవాదుల స్థావరాలను మట్టిలో కలిపేసింది. ఉగ్రవాద స్థావరాలతోపాటు వంద మందికి పైగా ఉగ్రవాదులు చనిపోయారు' అని ప్రధాని మోదీ వివరించారు. దేశంలోని సామాన్యుల జోలికి వచ్చినవారికి వినాశనమేనని హెచ్చరించారు. మన దేశ డ్రోన్లు, క్షిపణులను తలచుకుంటే పాకిస్థాన్‌కు నిద్రపట్టదు అని తెలిపారు. 'భవిష్యత్ తరానికి మీరంతా సరికొత్త ప్రేరణగా నిలిచారు. త్రివిధ దళాలు, బీఎస్ఎఫ్‌కు సెల్యూట్ చేస్తున్నా. ఆపరేషన్ సిందూర్‌తో భారతదేశం మొత్తం మీ వెంట నిలిచింది' అని ప్రధాని మోదీ వివరించారు. భారతేదశం బుద్ధుడి నేల.. గురుగోవింద్ సింగ్ గడ్డ అని గుర్తుచేశారు. అణుబాంబు హెచ్చరికలను భారత సైన్యం చిత్తు చేసిందని ప్రధాని మోదీ తెలిపారు. మళ్లీ ఉగ్రదాడి జరిగితే భారత్ కచ్చితంగా సమాధానం ఇస్తుందని చెప్పారు. 'సర్జికల్ స్ట్రైక్, ఎయిర్‌స్ట్రైక్ సమయాల్లో నిరూపించాం. ఇప్పుడు ఆపరేషన్ సిందూర్‌తో స్పష్టం చేశాం' అని మోదీ వివరించారు. పాకిస్థాన్ పౌర విమానాలను అడ్డం పెట్టుకుని దాడులకు పాల్పడిందని తెలిపారు. భారత శక్తి సామర్థ్యాలు చూసి తన జన్మ ధన్యమైనట్లు ప్రకటించారు.



## సీఎం రేవంత్ రెడ్డితో నూతన ఆర్టీఐ కమిషనర్ల భేటీ

తెలంగాణ ప్రభుత్వం తాజాగా నలుగురు సమాచార ఆర్టీఐ కమిషనర్లను నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని కుటుంబ సమేతంగా నూతన సమాచార కమిషనర్లు పీవీ శ్రీనివాసరావు, బోరెడ్డి అయోధ్యరెడ్డి, దేశాల భూపాల్, మొహిసినా పర్వీన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు శాలువలు కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. కాగా, గత కొన్నేళ్లుగా ఆర్టీఐ కమిషనర్ పదవులు ఖాళీగా ఉండటంతో, పౌరులకు సమయానికి సమాచారం లభించడంలో జాప్యం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నూతనంగా నియామకాలు చేపట్టడం పౌర హక్కుల పరిరక్షణలో కీలక ముందడుగు పడింది. ప్రస్తుతం నియమితులైన కమిషనర్లు వేర్వేరు రంగాల్లో అనుభవం కలిగి ఉన్నవారు. వారి అనుభవం సమాచార హక్కు అమలులో నాణ్యతను మెరుగు పరచడానికి తోడ్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.




పార్టీ మార్పుపై బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు స్పందించారు. పార్టీ మారుతున్నట్లు కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు హరీశ్ రావు. పార్టీ మారే పరిస్థితి లేదని చెప్పారు. సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారంపై గతంలోనే డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కొందరు కావాలనే అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

బీఆర్ఎస్ ఏర్పడక ముందు నుంచే కేసీఆర్ తో ఉన్నానని.. కేసీఆర్ ఏం చెబితే అది పాటిస్తానని హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ మాటే.. హరీశ్ బాట అని ఈ సందర్భంగా చెప్పారు. కేసీఆర్ ఏ బాధ్యత ఇచ్చినా తీసుకుంటానని, ఏ బాధ్యత లేకుంటే ఒక కార్యకర్తగా పనిచేస్తానని చెప్పారు. అంతేకాకుండా కేటీఆర్ కు బాధ్యతలు అప్పగిస్తే స్వాగతిస్తామని ప్రెస్ మీట్ లో చెప్పారు. బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత కలహాలు జరుగుతున్నాయనే విమర్శలు ఈ మధ్య వస్తున్నాయి. అధ్యక్ష పదవి కోసం కేటీఆర్, కవిత, హరీశ్ రావు ల మధ్య ఆధిపత్య పోటీ నడుస్తోందని, అందుకే కవిత సొంత ఎజెండాతో ముందుకు వెళుతుందనే ఊహాగానాలు ఈ మధ్య ఎక్కువయ్యాయి. కేటీఆర్, కవిత మధ్య ఆధిపత్య పోరులో హరీశ్ కు ప్రాధాన్యం తగ్గిందని, అందుకే పార్టీ మారే అవకాశం ఉందని ఇతర పార్టీల నాయకులు విమర్శించారు. సోషల్ మీడియాలో కూడా ఈ ఊహాగానాలు ఎక్కువయ్యాయి. అయితే పార్టీ మార్పు అనేది సోషల్ మీడియా ప్రచారమేనని, అందులో వాస్తవం లేదని హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ తోనే ఉంటానని, బీఆర్ఎస్ కార్యకర్తగానే పనిచేస్తానని క్లారిటీ ఇచ్చారు.




## పాక్‌పై ఇక ద్వైపాక్షిక ఒత్తిడి.. నేడు పలు దేశాలకు భారత్ స్పెషల్ బ్రీఫింగ్..!

దిల్లీ: ఉగ్ర ముఠాలకు అండగా ఉంటూ సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌కు భారత్ గట్టిగా బుద్ధి చెప్పింది. 'ఆపరేషన్ సిందూర్'తో శత్రుదేశాన్ని అన్నివిధాలుగా దెబ్బతీసిన న్యూదిల్లీ.. ఇప్పుడు దాయాదిపై ద్వైపాక్షికంగా ఒత్తిడి తెచ్చేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే నేడు పలు దేశాల సైనిక రాయబారులకు కేంద్రం ప్రత్యేక బ్రీఫింగ్ ఇవ్వనుంది. మన దేశంలో ఉన్న యూకే సహా పలు దేశాల డిఫెన్స్ అధికారులు, రాయబారులకు కేంద్రం ఇప్పటికే సమన్లు పంపించింది. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు దిల్లీలోని రక్షణశాఖ కార్యాలయంలో కీలక భేటీ నిర్వహించనుంది. ఇందులో 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన ముఖ్య వివరాలను ఆయా దేశాల ప్రతినిధులతో పంచుకోనుంది. ఉగ్రవాద నిర్మూలనలో భారత్ వేసిన ముందడుగు, అనంతరం చోటుచేసుకున్న పరిణామాల వివరాలను వారికి అందించనున్నట్లు సమాచారం. పాక్‌పై మిలిటరీ చర్యకు కారణాలు చెప్పి.. మద్దతు కొనసాగించాలని ఆ దేశాలను కేంద్రం కోరనున్నట్లు తెలుస్తోంది. నేటి మధ్యాహ్నం జరిగే భేటీలో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, పలువురు ఉన్నతాధికారులు, రక్షణశాఖ అధికారులు పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఇక, బుధవారం కేంద్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. భద్రతాపరంగా అనుసరించాల్సిన వ్యూహాలు, సైనిక సన్నద్ధతపై చర్చించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

**19న పార్లమెంటరీ కమిటీ సమావేశం...** మరోవైపు విదేశాంగ పార్లమెంటరీ స్థాయి సంఘం సభ్యులతోనూ 'ఆపరేషన్ సిందూర్' వివరాలను కేంద్రం పంచుకోనుంది. మే 19వ తేదీన పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ శశిథరూర్ నేతృత్వంలో సమావేశం జరగనుంది. ఇందులో విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ.. 'సిందూర్' వివరాలను సభ్యులకు వెల్లడించనున్నారు.




దిల్లీ: దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్కంఠగా ఎదురుచూస్తోన్న సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ 12వ తరగతి ఫలితాలు వచ్చేశాయి. మంగళవారం బోర్డు ఈ రిజల్ట్స్ ప్రకటించింది. విద్యార్థులు తాము సాధించిన స్కోరును cbse.gov.in, cbseresults.nic.in/ వెబ్‌సైట్‌ల ద్వారా తెలుసుకోవచ్చు. రోల్ నంబర్, పుట్టిన తేదీ, స్కూల్ నంబర్, అడ్మిట్ కార్డు నంబర్‌లను ఎంటర్ చేయడం ద్వారా ఫలితాలు చెక్ చేసుకోవచ్చు. అలాగే, డిజీలాకర్, ఉమాంగ్ మొబైల్ యాప్‌ల ద్వారా కూడా రిజల్ట్స్ పొందొచ్చు. ప్రస్తుతానికి సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాలపై స్పష్టత లేదు. వీటిని కూడా నేడే వెల్లడించే అవకాశాలున్నాయి.

**అత్యధిక ఉత్తీర్ణత విజయవాడలోనే..** 12వ తరగతిలో 83.39శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఫలితాల్లో బాలుర కంటే బాలికలే పైచేయి సాధించారు. అమ్మాయిల్లో 91.64శాతం, అబ్బాయిల్లో 85.70 శాతం మంది పాసయ్యారు. అత్యధికంగా విజయవాడలో 99.60శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఆ తర్వాత తిరువనంతపురంలో 99.32శాతం, బెంగళూరులో 95.95శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అత్యల్పంగా ప్రయాగ్‌రాజ్‌లో 79.53శాతం మంది పాసయ్యారు. మన దేశంలో 7,842 కేంద్రాలు, మరో 26 దేశాల్లో నిర్వహించిన సీబీఎస్ఈ 10, 12వ తరగతి పరీక్షలకు దాదాపు 42లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు.

వీరిలో 24.12 లక్షల మంది పదో తరగతి పరీక్షలు, 17.88లక్షల మంది 12వ తరగతి పరీక్షలు రాశారు. ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 4 మధ్య సీబీఎస్ఈ 10, 12వ తరగతి పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. విద్యార్థుల్లో అనారోగ్యకరమైన పోటీని నివారించేందుకు సీబీఎస్ఈ బోర్డు గత కొన్నేళ్లుగా మెరిట్ జాబితాలను వెల్లడించకూడదని నిర్ణయించిన విషయం తెలిసిందే.




భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం స్కీమ్?ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే.. సిబిల్ స్కోర్ (%జ×దీ×ూ ూజూ=జు%) ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారని ప్రచారం జరగడంతో యువతలో ఆందోళన నెలకొంది. గ్రామ యువతకు సిబిల్ స్కోర్?పై పెద్దగా అవగాహన ఉండదని.. స్కీమ్ గైడ్ లైన్స్?లో ఈ అంశాన్ని చేర్చొద్దని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో రాజీవ్ యువ వికాసం స్కీముపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క క్లారిటీ ఇచ్చారు. సిబిల్ స్కోర్?తో రాజీవ్ వికాసం స్కీమ్?కు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. అవగాహన లేని కొన్ని సోషల్ మీడియా, ఇతర సంస్థలు సిబిల్ స్కోర్ విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని అన్నారు. ఈ స్కీమ్?కు సంబంధించి మండల స్థాయిలో ప్రాసెస్?ను ప్రారంభమైందని.. జూన్ రెండవ తేదీ కల్లా లబ్ధిదారులకు మంజూరు లెటర్లు అందజేస్తామన్నారు. నిరుద్యోగ యువత తలెత్తుకొని బతికేందుకు రాజీవ్ యువ వికాస పథకాన్ని తీసుకొచ్చామని చెప్పారు. మంగళవారం (మే 13) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు నియోజకవర్గంలోని బయ్యారం, టేకులపల్లి మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు భట్టి శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం లాంటి స్కీమ్ భారత దేశంలోనే ఎక్కడ లేదని అన్నారు. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువకులు వాళ్ల కాళ్ళ మీద వాళ్ళు నిలబడేందుకు స్వయం ఉపాధి అవకాశాన్ని ఎంచుకొని ఎదగడానికి రాజీవ్ యువ వికాసం స్కీమ్ ఒక వరం లాంటిదన్నారు. పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఎలాంటి భృతిని, ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని మండిపడ్డారు. గత పది సంవత్సరాలు తెలంగాణ యువత నిరాశ నిస్పృహల్లో బతికిందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 52,000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని పేర్కొన్నారు. మిగిలిన ఉద్యోగాల భర్తీకి కోసం జాబ్ క్యాలెండర్ ప్రకటించామని గుర్తు చేశారు. ఇల్లందు నియోజకవర్గంలోని తులారం ప్రాజెక్ట్, బయ్యారం పెద్ద చెరువు మరమ్మత్తులతో పాటు ఇల్లందు ప్రాంతంలో సర్వే చేసి నివేదికను తయారుచేసి సీతారామ ప్రాజెక్టు ద్వారా నీళ్లందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలిపారు.

## అప్పటి వరకు తెలంగాణ పిల్లలకు ఏపీలో స్థానికత్వం కల్పించాలి: పొన్నం ప్రభాకర్



హైదరాబాద్: రాష్ట్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేసే వరకు ఏపీలో తెలంగాణ పిల్లలకు స్థానికత్వం కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. కేంద్రం, ఏపీ సర్కార్ నిర్ణయంతో సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష రాసిన 20వేల మంది విద్యార్థులు నైరాశ్యంలో ఉన్నట్లు తెలిపారు. దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాల్లో సైనిక్ స్కూళ్లు ఉన్నాయని, తెలంగాణలో తొందరగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.




## యువతకు టీటీడీ గోల్డెన్ చాన్స్.. నేరుగా శ్రీవారి దర్శనం

యువతకు బంపర్ చాన్స్ ఇస్తోంది తిరుమల తిరుపతి దేవస్థానం. ఏడు కొండలపై వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామని నేరుగా దర్శించుకునే అవకాశం కల్పిస్తోంది టీటీడీ. అయితే ఇందుకోసం వాళ్లు ఓ పని చేయాల్సి ఉంటుంది. సనాతన ధర్మం మీద యువతలో మరింత అనురక్తిని కల్పించే ఉద్దేశంతో రామకోటి తరహాలో గోవిందకోటిని 2 ఏళ్ల కింద ప్రవేశపెట్టింది టీటీడీ. గోవిందకోటి రాసిన యువతకు వీఐపీ బ్రేక్ దర్శనాన్ని కల్పిస్తూ వస్తోంది. 25 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయసు ఉన్నవారు దీనికి అర్హులు. 10,01,116 సార్లు గోవిందనామాలు రాసిన వారు వీఐపీ బ్రేక్ దర్శనం ద్వారా నేరుగా శ్రీవారిని చూసి తరించొచ్చు. కోటిసార్లు గోవిందనామాలు రాస్తే వారితో పాటు కుటుంబ సభ్యులంతా వీఐపీ బ్రేక్ దర్శనం చేసుకోవచ్చు.

**ఎంత సమయం పడుతుందంటే..** తిరుమల తిరుపతి దేవస్థానం సమాచార కేంద్రాలతో పాటు పుస్తక విక్రయ కేంద్రాలు, ఆన్‌లైన్‌లోనూ గోవిందకోటి నామాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కోటి నామాల పుస్తకాన్ని పూర్తి చేయడానికి కనీసం 3 ఏళ్ల సమయం పడుతుందని టీటీడీ అంచనా వేసింది. 200 పేజీలు ఉండే దాదాపు 26 పుస్తకాలు అవసరమవుతాయని తెలిపింది. తిరుమలలోని టీటీడీ పేష్కార్ ఆఫీసులో గోవిందకోటి నామాల పుస్తకాన్ని అందిస్తే ఆ తర్వాతి రోజు వీఐపీ బ్రేక్ దర్శనాన్ని కల్పిస్తామని పేష్కార్ రామకృష్ణ తెలిపారు. కాగా, తొలిసారిగా గోవిందకోటి నామాల పుస్తకాన్ని పూర్తి చేసిన కర్ణాటకకు చెందిన కీర్తనకు టీటీడీ వీఐపీ బ్రేక్ దర్శనాన్ని కల్పించింది. ఆ తర్వాత మరో ఇద్దరు గోవిందకోటి నామాలను రాసి ఇదే విధంగా వీఐపీ బ్రేక్ దర్శనం పొందారని టీటీడీ అధికారులు తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com